సోమవారం
25-03-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 273
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

చైనా నౌకపై హౌతీల క్షిపణి దాడి

వాషింగ్టన్: ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై హౌతీల దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా చైనాకు చెందిన చమురు ట్యాంకర్ షిప్ 'ఎంవీ హువాంగ్ పు'పై బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించారు. ఈ దాడిని అమెరికా సెంట్రల్ కమాండ్, యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ధ్రువీకరించాయి. శనివారం సాయంత్రం 4.25 గంటలకు ప్రమాదం జరిగినట్లు వెల్లడించాయి. నౌకలో మంటలు చెలరేగగా వాటిని త్వరగా ఆర్పివేయడంతో పెద్దగా నష్టం వాటిల్ల లేదని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. యెమన్ నౌకాశ్రయం మోఖా నుంచి 23 నాటికల్ మైళ్ల దూరంలో ఈ దాడి జరిగినట్లు వెల్లడించింది. ఈ నౌక భారత్‌లోని మంగళూరుకు వెళుతున్నట్లు తెలిసింది.

ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం

- కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఆప్ కొవ్వొత్తుల ర్యాలీ
- ఢిల్లీ వీధుల్లో నిరసన ప్రదర్శనలు

న్యూఢిల్లీ: మద్యం పాలసీ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసినందుకు నిరసనగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఆదివారం దేశ రాజధాని అంతటా నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకే తాము నిరసనకు దిగామని ఆ పార్టీ నాయకులు తెలిపారు. న్యూఢిల్లీలోని కొండ్లీ ప్రాంతంలో సాయంత్రం జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో అతిశి, కుల్దీప్ కుమార్‌తో సహా అనేక మంది ఆప్ నేతలు పాల్గొన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఆప్ కార్యకర్తలు, మద్దతుదారులు నినాదాలు చేశారు. ఈడీ చర్యకు వ్యతిరేకంగా ఢిల్లీలోని గోవింద్‌పురి ప్రాంతంలో దిష్టిబొమ్మలను దహనం చేశారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కేజ్రీవాల్‌కు లభిస్తున్న ప్రజాదరణ కారణంగా కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం వెనుక బీజేపీ హస్తం ఉందని ఆరోపించారు. కేజ్రీవాల్‌ను మార్చి 21న ఈడీ అరెస్ట్ చేసింది. రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం మార్చి 28 వరకు ఢిల్లీ సీఎంకు రిమాండ్ విధించింది. కొవ్వొత్తుల ప్రదర్శనలో పార్టీకి చెందిన అనేక మంది మహిళా కార్యకర్తలకు నాయకత్వం వహించిన ఆప్ నాయకురాలు, ఢిల్లీ మంత్రి అతిశి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే తాము నిరసన తెలుపుతున్నామని, అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా ఆప్ ఢిల్లీలోని ప్రతి వార్డు, అసెంబ్లీ నియోజకవర్గంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'లోక్‌సభ ఎన్నికల ప్రకటన తర్వాత, ఒక జాతీయ పార్టీ కన్వీనర్‌ను అరెస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలు స్తంభింపజేశారు. రెండు రోజుల నుంచి ఆప్ కార్యాలయానికి సీలు వేయడంతో పాటు బారికేడ్‌లు పెట్టారు. ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని ప్రధాని మోదీ నిర్ణయించుకున్నారా?, దీనికి వ్యతిరేకంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్నాం' అని అన్నారు.

ఇదిలాఉండగా, ఆదివారం ఉదయం ఆప్ కార్యకర్తలు పార్టీ ఎమ్మెల్యే సంజీవ్ ఝా సమక్షంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. 'మై భీ కేజ్రీవాల్' అని రాసి ఉన్న బ్యానర్‌లను పట్టుకుని ఉన్న అనేక మంది కార్యకర్తలు, నాయకులు ఆందోళన చేపట్టారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం ద్వారా బీజేపీ చాలా పెద్ద తప్పు చేసిందని ఆప్ నేత సందీప్ పాఠక్ అన్నారు. 'ఢిల్లీలోని ప్రతి కుటుంబంలో కేజ్రీవాల్

- మిగతా 2 లో

జైలు నుంచే కేజ్రీవాల్ పాలన

ఢిల్లీలో నీటిసరఫరాపై ఉత్తర్వులు

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచే పాలన సాగిస్తున్నారు. ఈడీ కస్టడీ నుంచి ఢిల్లీ సీఎం తొలిసారి అధికారిక ఆదేశాలను జారీ చేశారు. దేశ రాజధానిలో నీటి సరఫరాకు సంబంధించి ఈ ఉత్తర్వులను కేజ్రీవాల్ జారీ చేసినట్లు ఢిల్లీ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ

- మిగతా 2 లో

జేఎన్‌యూఎస్‌యూ ఎన్నికల్లో లెఫ్ట్ ఘన విజయం

నాలుగు స్థానాలూ కైవసం

ధనంజయ్

న్యూఢిల్లీ: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం (జేఎన్‌యూఎస్‌యూ) ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థులు విజయం సాధించారు. మొత్తం నాలుగు స్థానాలను కైవసం చేసుకున్నారు. తొలుత ఏబీవీపీ ఆధిక్యతలో ఉండగా క్రమంగా యునైటెడ్ లెఫ్ట్ పుంజుకుంది. అధ్యక్షుడిగా లెఫ్ట్ అభ్యర్థి ధనంజయ్ ఎన్నికయ్యారు. ఆయన 2,973 ఓట్లతో గెలిచారు. ఏబీవీపీ అభ్యర్థి ఉమేశ్ సి అజ్మీరాకు 2,039 ఓట్లతో రెండవ స్థానంలో నిలిచారు. ఉపాధ్యక్షుడిగా వామపక్ష అభ్యర్థి అవిజిత్ ఘోష్ గెలిచారు. ఆయనకు 2,649 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి, ఏబీవీపీ అభ్యర్థి దీపికా శర్మకు 1,778 ఓట్లు రాగా ఆమె ఓడిపోయారు. ప్రధాన కార్యదర్శిగా లెఫ్ట్ మద్దతిచ్చిన బీఏపీఎస్ఏ అభ్యర్థి ప్రియాంషీ ఆర్య ఎన్నికయ్యారు. ఆమెకు 3,307 ఓట్లు వచ్చాయి. లెఫ్ట్ అభ్యర్థి స్వాతి సింగ్ అభ్యర్థిత్వాన్ని చివరి నిమిషంలో ఎన్నికల సంఘం రద్దు చేయడంతో ఆర్యకు మద్దతివ్వాలని యునైటెడ్ లెఫ్ట్ నిర్ణయించిన విషయం తెలిసిందే. అలాగే ఇదే పదవికి ఏబీవీపీ తరపున పోటీ చేసిన అర్జున్ ఆనంద్ (2,309 ఓట్లు రాగా) ఓడిపోయారు. సంయుక్త కార్యదర్శిగా లెఫ్ట్ అభ్యర్థి మహమ్మద్ సాజిద్ ఎన్నికయ్యారు. 2,893 ఓట్లు

- మిగతా 2 లో

ఎన్నికల వేడి!

- మేమంతా సిద్ధం, ప్రజాగళం పేరుతో
- వైసీపీ, టీడీపీ పోటాపోటీ ప్రచారం
- 27 నుంచి సభలు, రోడ్‌షోలు
- పవన్ పోటీపై అస్పష్టత... శ్రేణుల్లో గందరగోళం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల వేడి మొదలైంది. వైసీపీ అధినేత... సీఎం జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 27 నుంచి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. సార్వత్రిక ఎన్నికలు మే 13 నుంచి జరగనున్నాయి. ఆశించిన దానికంటే రాష్ట్రంలో ఎన్నికలు దాదాపు 55 రోజులపాటు వెనక్కి వెళ్లడంతో టీడీపీ కూటమి ఊపిరి పీల్చుకోగా, అధికార వైసీపీ కాస్త నిరుత్సాహం వ్యక్తం చేసింది. అదే సమయంలో 70 స్థానాల్లో వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల మార్పులు, చేర్పులు, కొత్త వారికి టికెట్లు ఇవ్వడం వెరసి ఎన్నికలు వెనక్కి వెళ్లడం తమకు మరింత ప్రచారం చేసుకునేలా కలిసొచ్చిన అవకాశంగా వైసీపీ భావిస్తోంది. జగన్... 'మేమంతా సిద్ధం' పేరుతో ఈ నెల 27 నుంచి బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు. వైఎస్‌ఆర్ కడపజిల్లా ఇడుపులపాయ వైఎస్‌ఆర్ ఘాట్ వద్ద తన తండ్రికి నివాళులర్పించి బస్సు యాత్ర ప్రారంభిస్తారు. యాత్రతోపాటు ఉదయం ప్రముఖులు, మేధావులు, వివిధ రంగాల నేతలతో సీఎం భేటీలు నిర్వహించి వారి సూచనలు, సలహాలు స్వీకరిస్తారు. ప్రజా సమస్యలపై ఆలకిస్తారు. అనంతరం రోడ్‌షోలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం పార్టీ ముఖ్యనేతలతో భేటీ అవుతారు. పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంగా ఏదో ఒక అసెంబ్లీలో సిద్ధం సభల తరహాలో బహిరంగ సభ ఉంటుంది. తొలి విడత జగన్ చేపట్టిన రాయలసీమ ప్రాంతంలోనే చంద్రబాబు ఎన్నికల ప్రచారం ఉంటుంది. ఇప్పటికే వైసీపీ అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థుల జాబితాలను పూర్తి స్థాయిలో

- మిగతా 2 లో

111 మంది అభ్యర్థులతో బీజేపీ ఐదో జాబితా

ఏపీలో ఆరుగురు... తెలంగాణలో ఇద్దరు

8లో

బీజేపీ సీనియర్లకు మొండిచేయి

- వైసీపీ ఎంపీ రఘురామకు షాక్
- జాబితాలో కనిపించిన టీడీపీ ముద్ర!

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : లోక్‌సభ ఎన్నికలకు ఏపీలో పోటీ చేసే అభ్యర్థుల జాబితాలో ఆ పార్టీ సీనియర్లకు మొండిచేయి చూపించింది. అటు నరసాపురం వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజుకు పెద్ద షాక్ తగిలింది. పొత్తుల్లో భాగంగా ఆయన

- మిగతా 2 లో

వ్యవస్థలను నిలబెట్టేది మీడియానే

- విజయవాడ సెమినార్‌లో ఐజేయూ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి
- శ్రీనివాసరెడ్డిని సన్మానించిన జర్నలిస్టులు, ప్రజాసంఘాలు

విశాలాంధ్ర–విజయవాడ: సమాజంలో మార్పు తీసుకురాగల శక్తి జర్నలిజానికి ఉందని, దిగజారిపోతున్న వ్యవస్థలను నిలబెట్టేది మీడియానే అని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) అధ్వర్యంలో 'సార్వత్రిక ఎన్నికలు–మీడియా పాత్ర' అనే అంశంపై ఇక్కడ ఆదివారం ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి వందల కోట్లు ఖర్చు చేస్తున్నా ఎన్నికల సంఘం కళ్లకు గంతలు కట్టుకున్నట్లు వ్యవహరిస్తోందన్నారు. మీడియాలో వార్తలు వస్తున్నప్పటికీ వాస్తవాలను బయటపెట్టటానికి సంకోచిస్తోందన్నారు. ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యత పెరిగిందని, ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కనీస ఖర్చు రూ.10,702 కోట్లుగా ఉందన్నారు. రాజకీయ పార్టీలకు ఎన్నికల బాండ్ల ద్వారా డబ్బు సమకూరుతుందన్నారు. అంతేకాకుండా ఐటీ, ఈడీ, సీబీఐ దాడులు చేయటం ద్వారా కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి వేల కోట్ల రూపాయలు సమకూరుతున్నాయని తెలిపారు. దేశంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 23 శాతం ప్రజలు ఓటు వేసేందుకు డబ్బులకు ఆశపడి ఉండవచ్చునేమోగానీ ఉపాధ్యాయ, పట్టభద్రుల

- మిగతా 2 లో

'సంధ్య ఆక్వా' బస్సు కలకలం

- నాలుగురోజులుగా మూలపేటలో నిలిపివేత
- బస్సులో రికార్డులు, పరికరాలు, చెక్‌బుక్స్ లభ్యం
- వెంటాడుతున్న అనుమానాలు
- బ్రేక్‌డౌన్ అయిందన్న పోలీసులు

విశాలాంధ్ర – యు కొత్తపల్లి : విశాఖ డ్రగ్స్ కేసుకు సంబంధించి పొన్నాడ పంచాయతీ శీలంవారి వారి పాలెంలో ఉన్న సంధ్య ఆక్వా పరిశ్రమలో సీబీఐ సోదాలు చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే కొత్త మూలపేట ఎస్ఈజెడ్ కాలనీలో గత నాలుగు రోజులుగా ఆక్వా పరిశ్రమకు చెందిన బస్సు నిలుపుదల చేసి ఉందని స్థానికులు గమనించి యు కొత్తపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొత్తపల్లి ఎస్సై స్వామి నాయుడు తన సిబ్బందితో హుటా హుటిన మూలపేట చేరుకున్నారు. బస్సుకు సంబంధించిన తాళాలు తీయించి, లోపల ఉన్న అట్ట పెట్టెల్ని పరిశీలించారు. వాటిలో కొన్ని రికార్డులు, కొన్ని కంప్యూటర్ పరికరాలు, ఫైల్స్, కొత్త చెక్ బుక్స్, యంత్ర సామాగ్రి ఉన్నట్లు గుర్తించారు. దీనిపై ఎస్సై స్వామి నాయుడు మాట్లాడుతూ... అట్ట బాక్సుల్లో అనుమానించ దగ్గవేవీ లేవన్నారు. కాకినాడ నుంచి వస్తుండగా బ్రేక్ డౌన్ అయిందని, ఇదే గ్రామంలో కంపెనీకి చెందిన సూపర్‌వైజర్ మహేశ్ అనే వ్యక్తి ఇల్లు ఉండడంతో బస్సు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

31న ఢిల్లీలో సేవ్ డెమోక్రసీ ర్యాలీ

అణచివేతను సహించబోమని ఇండియా కూటమి హెచ్చరిక

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును ప్రతిపక్ష ఇండియా కూటమి తీవ్రంగా పరిగణిస్తోంది. ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులతో అనుచితంగా వ్యవహరిస్తున్న కేంద్రంలోని మోదీ సర్కారుకు గట్టిగా బుద్ధి చెప్పాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మార్చి 31న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో 'మహా ర్యాలీ' నిర్వహించాలని కూటమి నిర్ణయించింది. దేశాన్ని కాపాడటం కోసం అన్ని ఆధ్యాత్మిక, వ్యాపార, రాజకీయ సంఘాలు 'మహా ర్యాలీ' బహిరంగ సభలో పాల్గొనాలని కూటమి నేతలు పిలుపునిచ్చారు. విపక్ష నేతలపై మోదీ సర్కారు అణచివేత వైఖరికి నిరసనగా మార్చి 31న దేశ రాజధానిలోని రాంలీలా మైదాన్‌లో 'మహా ర్యాలీ' నిర్వహిస్తున్నట్లు ఆప్ సీనియర్ నేత గోపాల్ రాయ్ ప్రకటించారు. ఆదివారం ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్విందర్ సింగ్ లవ్లీతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈవిషయాన్ని వెల్లడించారు. దేశాన్ని కాపాడటానికి అన్ని వర్గాల వారు, సంఘాల వారు 'మహా ర్యాలీ' బహిరంగ సభలో పాల్గొనాలని గోపాల్ రాయ్ కోరారు. ఆదివారం ఉదయం 10 గంటలకు రాంలీలా మైదాన్ వేదికగా యావత్ ఢిల్లీ ఏకం కావాలన్నారు. రాజ్యాంగాన్ని రక్షించాలని భావించే వారు... ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే వారు తప్పకుండా ఈ సభకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 'సీఎం కేజ్రీవాల్ అరెస్టును అందరూ వ్యతిరేకిస్తున్నారు. దీనిపై రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే, గౌరవించే ప్రతి వ్యక్తిలోనూ ఆగ్రహం ఉంది. ప్రతిపక్ష నేతలపై నకిలీ కేసులు పెట్టేందుకు

- మిగతా 2 లో

బీజేపీలో భగ్గుమన్న అసమ్మతి

- ఔటర్‌మణిపూర్‌లో అభ్యర్థిని నిలపకపోవడంపై ఆగ్రహం
- పార్టీలో అంతర్గతంగా తిరుగుబాటు
- స్థానిక కార్యాలయం ధ్వంసం - కుర్చీలు, టేబుళ్లు విరగొట్టిన వైనం

ఇంఫాల్/గువహటి: మన పార్టీ అభ్యర్థిని నిలబెట్టకుండా వేరొక పార్టీ అభ్యర్థికి మద్దతివ్వడం ఏమిటంటూ బీజేపీ అధిష్ఠానాన్ని మణిపూర్ పార్టీ శాఖ నిలదీసింది. మిత్రపక్షం అభ్యర్థికి మద్దతు ప్రకటించడాన్ని వ్యతిరేకించింది. దీంతో బీజేపీ మణిపూర్ శాఖలో అసమ్మతి భగ్గుమన్నది. ఔటర్ మణిపూర్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు అభ్యర్థిని ప్రకటించకపోవడం పార్టీ వర్గాలకు ఆగ్రహం తెప్పించింది. పర్యవసానంగా క్షేత్రస్థాయిలో తిరుగుబాటు వచ్చింది. స్థానిక అభ్యర్థిని కాదని మిత్రపక్షమైన నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్)తో పొత్తు క్రమంలో ఆ పార్టీ అభ్యర్థికి మద్దతిస్తామని బీజేపీ ప్రకటించడాన్ని మణిపూర్ నేతలు, కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు. అసమ్మతి గళం వినిపించారు. బీజేపీ సేనాపతి జిల్లాలో కార్యకర్తలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. శనివారం ఉదయం సేనాపతిలోని పార్టీ కార్యాలయానికి వెళ్లి విధ్వంసం సృష్టించారు. కుర్చీలు, బల్లలు విరగొట్టారు. రోజువారీ కార్యకలాపాలను అడ్డుకున్నారు. పార్టీ ఆస్తికి నష్టం కలిగించారు. సామాజిక మాధ్యమాల్లోనూ నిరసనను వ్యక్తంచేశారు. ఎన్‌పీఎఫ్ తరపున ఔటర్ మణిపూర్ స్థానానికి కచుయీ తిమోతీ జిమిక్ పోటీ చేస్తున్నారు. ఆయన గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ స్థానానికి ఏప్రిల్ 11న ఎన్నికలు జరగనున్నాయి. తిమోతీ జిమిక్‌కు మద్దతివ్వాలని బీజేపీ నాయకత్వం నిర్ణయించింది. ఇదే విషయాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ ఫేస్‌బుక్ మాధ్యమంగా ప్రకటించారు. 'రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఔటర్ మణిపూర్ నియోజకవర్గంలో ఎన్‌పీఎఫ్ అభ్యర్థికి మద్దతివ్వాలని బీజేపీ

- మిగతా 2 లో

పార్టీలను వీడి...!

కాంగ్రెస్ గూటికి ఎమ్మెల్యేలు ఎలిజా, బీజేపీలోకి వరప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆశావహులు అవకాశాలు సన్నగిల్లడంతో పార్టీలను వీడుతున్నారు. టికెట్ కోసం చివరి వరకూ విశ్వప్రయత్నం చేసి ఆశాభంగం కలగడంతో పొరుగు పార్టీల వైపు పరుగులు పెడుతున్నారు. వైసీపీ టికెట్టు నిరాకరించడంతో అసంతృప్తికి గురైన నెల్లూరు జిల్లా గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ ఆదివారం బీజేపీలో చేరారు. గూడూరులో అసమ్మతిరాగం అధికమవ్వడం, గెలిచే అవకాశాలు లేకపోవడంతో వైసీపీ ఆయనకు టికెట్టు నిరాకరించింది. వైసీపీకి చెందిన ఏలూరు జిల్లా చింతలపూడి సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలిజా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక రాజకీయాలు తట్టుకోలేక అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో పార్టీని వీడాల్సి

- మిగతా 2 లో

ఆ 300 మంది విద్యార్థులు క్షేమం

అబూజ: నైజీరియాలోని మారుమూల గ్రామంలోని బడి నుంచి అపహరణకు గురైన దాదాపు 300 మంది విద్యార్థులు రెండు వారాల తర్వాత క్షేమంగా విడుదలయ్యారు. నైజీరియా సైన్యం మిషన్ విజయవంతమైంది. విద్యార్థులు ఆదివారం విడుదలయ్యాయి. వాయువ్య కడునా రాష్ట్ర గవర్నర్ ఉబా సాని ఈ మేరకు ప్రకటించారు. ఇందుకోసం అధ్యక్షుడు బోలా టినుబుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు అపహరణకు గురి కావడంతో నైజీరియాలో కొత్తేమీ కాదు. 2014 నుంచి అపహరణల పర్వం కొనసాగుతోంది. ఇటీవలకాలంలో వాయువ్య, సెంట్రల్ ప్రాంతాలలోనూ కిడ్నాప్‌లు జరిగాయి. ఇలా అపహరణల ద్వారా గ్రామస్తుల నుంచి డబ్బు, నగలను సాయుధులు దోచుకుంటుంటారు.

వెనక్కి తగ్గకుంటే ఇజ్రాయిల్ ఏకాకి అవుతుంది

నెతన్యాహుకు బ్లింకెన్ హెచ్చరిక

రఫాపై దాడి చేసితీరుతాం: నెతన్యాహు

టెల్‌అవీవ్: గాజా స్ట్రిప్‌లో దాడులు కొనసాగిస్తే అంతర్జాతీయంగా ఇజ్రాయిల్ ఏకాకి అవుతుందని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును అమెరికా మంత్రి ఆంటోనియో బ్లింకెన్ హెచ్చరించారు. పశ్చిమాసియాలో శాంతి మిషన్ సందర్భంగా ఆయన నెతన్యాహుతో ముఖాముఖి భేటీ అయ్యారు. పలస్తీనియన్లపై ఇజ్రాయిల్ దాడుల గురించి చర్చించారు. అనంతరం టెల్ అవీవ్‌లో విలేకరులతో బ్లింకెన్ మాట్లాడారు. హమాస్‌ను ఓడించాలనే లక్ష్యం సరైనదే, అందుకు ఇజ్రాయిల్‌కు మా సమర్థన ఉంది కానీ రఫాపై భీకర దాడులు చేయడమే ఇందుకు మార్గమంటే ఒప్పుకోమని బ్లింకెన్ అన్నారు. భూతల దాడులను తీవ్రతరం చేయడం వల్ల అమాయక పౌరులు చనిపోతున్నారని, మానవతా సహాయానికి, భద్రతకు విఘాతం కలుతుందని, ప్రపంచ దేశాలు ఇజ్రాయిల్‌ను ఏకాకి చేస్తాయని బ్లింకెన్ వెల్లడించారు. ఇదిలావుంటే వాషింగ్టన్ తమతో కలిసి రాకపోయినా పర్వాలేదు కానీ రఫాపై సైనిక ఆపరేషన్ జరిగి తీరుతుందని నెతన్యాహు తేల్చిచెప్పారు. రఫాలోకి వెళ్లకుండా హమాస్‌ను ఓడించలేమన్నారు. ఇదే విషయాన్ని బ్లింకెన్‌కు వెల్లడించినట్లు ఆయన విలేకరులతో అన్నారు. అమెరికా మద్దతుతో ఈ ఆపరేషన్ జరగాలని కోరుకుంటున్నామన్నారు. వాషింగ్టన్ మద్దతివ్వకపోతే ఒంటరిగానే ముందుకు వెళతామని నెతన్యాహు ఓ వీడియోను విలేకరులకు విడుదల చేశారు. ఇప్పటికే 32 వేలమంది పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోగా, శిథిలాల కింద గుట్టలుగా శవాలు ఉన్నట్లు గాజా ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు.

'హంతకులారా వెళ్లిపోండి'

అమెరికా-నాటో ట్యాంకుల రవాణా రైలును అడ్డుకున్న గ్రీస్ కమ్యూనిస్టులు

ఏథెన్స్: అమెరికా-నాటో సైనిక పరికరాలు, యుద్ధ వాహనాలు (ట్యాంకు) తరలిస్తున్న రైలును గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ), గ్రీస్ కమ్యూనిస్ట్ యూత్ (కేఎన్‌ఈ) సభ్యులు అడ్డుకున్నారు. ఉత్తర నగరమైన అలెగ్జాండ్రోపోలిస్‌లో ఈ రైలును నిలువరించారు. బ్యానర్లు, జెండాలతో అడ్డంగా నిలుచున్న క్రమంలో రైలు ఆగక తప్పలేదని 902పోర్టల్ నివేదించింది. సాయుధ వాహనాలపై స్ప్రే పెయింట్‌తో 'హంతుకురాలా వెళ్లిపోండి' అని నిరసనకారులు రాశారు. అలెగ్జాండ్రోపోలిస్ నగరాన్ని నాటో సైనిక శిబిరంగా మార్చడాన్ని వ్యతిరేకించారు. ఈ దిశగా చర్యలను తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టుల ఆందోళన ఫలితంగా ఆ రైలు వెనక్కి వెళ్లక తప్పలేదు. అమెరికా-నాటోకు వ్యతిరేకంగా అలెగ్జాండ్రోపోలిస్‌లో కేకేఈ, కేఎన్‌ఈ సభ్యులు ఆందోళన చేయడం ఇది మొదటిసారి కాదు. రెండేళ్ల కిందట అంటే 2022లోనూ ఇదే తరహా దిగ్బంధనాన్ని నిర్వహించారు. ఉక్రెయిన్‌కు సైనిక పరికరాలు, యుద్ధ వాహనాలు తరలించే రైలును నిలిపివేశారు.

పార్టీలను వీడి...!

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిందని ఆయన చెప్పుకొచ్చారు.

కాంగ్రెస్‌లోకి చింతలపూడి వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలిజా చేరారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల నేతృత్వంలో ఆయన పార్టీలో చేరారు. ఎలిజాకు షర్మిల కాంగ్రెస్ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎలిజా మాట్లాడుతూ నా రాజీనామాను వైసీపీకి పంపినట్లు, షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు స్పష్టంచేశారు. చింతలపూడి నియోజక వర్గంలో స్థానిక రాజకీయాలు తట్టుకోలేక పోయానని, తనను ఇబ్బంది పెట్టారని, అవమాన పరిచారని చెప్పారు. నా పేర్లను శిలా ఫలకాలపై లేకుండా చేశారన్నారు. వీటిపై అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లినా ఉపయోగం లేదని వాపోయారు. దేశానికి, రాష్ట్రానికి కాంగ్రెస్ చాలా అవసరమని, కాంగ్రెస్ నిజమైన సెక్యులర్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ ఒక్కటే ఏ మతానికి, కులానికి బేస్ కాదని, కాంగ్రెస్ లో కష్టపడతానని, కచ్చితంగా కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసీపీలో ఉన్న అసమ్మతి నేతలు చాలా మంది కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు.

వైసీపీలో టికెట్టు నిరాకరించడంతో అసంతృప్తికి గురైన గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ బీజేపీలో చేరారు. ఢిల్లీలోని ఆ పార్టీ నేతల సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాబోయే ఎన్నికల్లో తిరుపతి (ఎస్సీ) స్థానం నుంచి ఆయన బరిలోకి దిగే అవకాశాలున్నాయి. అంతకుముందు మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయానికి వరప్రసాద్ వెళ్లి జనసేనలో చేరేందుకు ప్రయత్నించారు. అయితే అక్కడ కూడా ఆయనకు టికెట్‌పై హామీ దక్కకపోవడంతో బీజేపీ చెంతన చేరారు. ఎమ్మెల్యే వరప్రసాద్ 2014లో వైసీపీ తరపున తిరుపతి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుతం గూడూరులో ఆయనకు అసమ్మతిరాగం అధికమవ్వడం, గెలిచే అవకాశాలు లేకపోవడంతో వైసీపీ టికెట్టును నిరాకరించింది. దీంతో కొంతకాలంగా ఆయన పార్టీకి దూరంగా ఉంటూ చివరకు బీజేపీలో చేరారు.

పవన్‌ను కలిసిన టీడీపీ పిఠాపురం నేత వర్మ

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను టీడీపీ పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్వీఎస్ వర్మ కలిశారు. మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో ఆదివారం పవన్‌ను వర్మతోపాటు టీడీపీ కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి సుజయకృష్ణ రంగారావు కలిశారు. పిఠాపురం నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను వారికి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, పవన్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని వారు తెలిపారు. మూడు పార్టీలు సమన్వయంతో కలిసి పనిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో పిఠాపురం నుంచి పవన్ ప్రచారం ప్రారంభిస్తారన్నారు.

'సంధ్య ఆక్వా' బస్సు కలకలం

(మొదటిపేజీ తరువాయి)

అక్కడ నిలిపినట్లు కంపెనీ సంబంధించిన వారు చెప్పారని ఆయన తెలిపారు. కంపెనీకి సంబంధం లేని చోట నాలుగురోజులుగా బ్రేక్‌డౌన్ పేరుతో బస్సు నిలిపివేయడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బస్సుతో పాటు కీలకమైన పరికరాలు, చెక్కు బుక్స్, రికార్డులను రోజుల తరబడి వదిలేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా బస్సు వెనుక భాగంలో ఉన్న సంధ్య ఆక్వా స్టిక్కరింగ్ తీసివేయడం జరిగిందని చెబుతున్నారు. నాలుగు రోజుల క్రితం పొన్నాడ పంచాయతీ శీలంవారి పాలెం గ్రామంలో ఉన్న సంధ్య ఆక్వా పరిశ్రమపై సీబీఐ దాడులు చేసిందని, ఆరోజు ఉదయం ఇదే బస్సు కంపెనీ నుంచి బయటకు వచ్చిందని, ఆ బస్సునే ఈ ప్రాంతంలో వదిలి వెళ్లారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఎస్సై పాత్రికేయులకు వివరణ ఇచ్చిన అనంతరం బ్రేక్ డౌన్ అయిందని వదిలేసిన బస్సును సంబంధిత ఆక్వా పరిశ్రమకు చెందినవారు హడావిడిగా కంపెనీకి తీసుకువెళ్లడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగు రోజులుగా నిలిచిపోయిన బస్సుని, బస్సులో ఉన్న పరికరాలను, రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు.

ఎన్నికల వేడి!

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేసింది. ఆయా అభ్యర్థులంతా ఇంటింటా తిరుగుతూ వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, స్థానిక అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కలిసి పార్లమెంట్ నియోజకవర్గాల కేంద్రంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అటు టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే సీట్లను విడుదల చేసింది. కూటమిలోని జనసేన, బీజేపీ అభ్యర్థులను ప్రకటించడంలో వెనుకబాటుకు గురయ్యాయి. కూటమి చిలకలూరిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించగా, ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ హాజరయ్యారు. ఎన్నికల్లో జగన్ పులివెందుల నుంచి, చంద్రబాబు కుప్పం నుంచి పోటీ చేయనున్నారు. పవన్ కల్యాణ్ పిఠాపురం అసెంబ్లీ నుంచి పోటీ చేస్తానని ప్రకటించినప్పటికీ, మధ్యలో వీలైతే కాకినాడ ఎంపీగా బరిలో ఉంటానని చెప్పడం ఆ పార్టీ శ్రేణుల్లో గందరగోళానికి దారితీస్తోంది. దీంతో పవన్ పోటీపై అస్పష్టత నెలకొంది.

చంద్రబాబు ప్రజాగళం షెడ్యూల్ ఇలా...

చంద్రబాబు ఈనెల 27 నుంచి 31 వరకు ఐదు రోజులపాటు ప్రజాగళం పేరుతో రోజుకు మూడు నుంచి నాలుగు నియోజకవర్గాల్లో సభలు, రోడ్ షోలు సాగేలా ప్రణాళిక రూపొందించారు. ఈనెల 27న పలమనేరు, నగరి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. 28న రాప్తాడు, శింగనమల, కదిరి, 29న శ్రీశైలం, నందికొట్కూరు, 30న మైదుకూరు, ప్రొద్దుటూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ప్రచారంలో పాల్గొంటారు. 31న కావలి, మార్కాపురం, సంతనూతలపాడు, ఒంగోలుకు వెళ్తారు. అనంతరం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలో ప్రచారం నిర్వహిస్తారు.

చంద్రబాబు ఇంటికి బారులు తీరిన ఆశావహులు

టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటికి ఆ పార్టీకి చెందిన ఆశావహులు పెద్ద ఎత్తున వచ్చారు. ఉండవల్లి నివాసానికి గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, దేగల ప్రభాకర్ వెళ్లారు. భీమిలి టికెట్ కోసం కోరాడు రాజబాబు ప్రయత్నిస్తున్నారు. విజయనగరం లోక్‌సభకు చంద్రశేఖర్ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజుకు టికెట్ ఇవ్వాలని చంద్రబాబు నివాసానికి మందా కృష్ణమాదిగ వచ్చారు. ఆశావహులంతా టికెట్ల కోసం చివరి ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

వ్యవస్థలను నిలబెట్టేది మీడియానే

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు కూడా ఓటుకు డబ్బులు తీసుకోవటం దారుణం అన్నారు. పత్రికా స్వేచ్ఛ, హక్కుల కోసం ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉందని, ఎలక్ట్రానిక్ మీడియాకు అలాంటి వ్యవస్థ లేకపోవటంపై విచారం వ్యక్తం చేశారు. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాను ఒకే వ్యవస్థగా తీసుకొని మీడియా కౌన్సిల్ ఏర్పాటు చేయాలని అనేక సార్లు కేంద్రానికి వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ప్రధాన స్రవంతిలోని మీడియా బయటకు తీయలేని వాస్తవాలను సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. స్వీయ నియంత్రణ పాటించాల్సిన సోషల్ మీడియాలో విశృంఖలత్వం పెరిగిపోవటం ఆందోళన కలిగిస్తోందన్నారు. వర్కింగ్ జర్నలిస్టులకు ఉన్న చట్టాన్ని కేంద్రం రద్దు చేసి జర్నలిస్టులను మెడికల్ రిప్రజెంటేటివ్స్ కేటగిరిలో చేర్చిందన్నారు. జర్నలిస్టులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై క్రిమినల్ కేసులు, నేరారోపణలు ఉంటే ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. మీడియానే ప్రజాస్వామ్యానికి కళ్లు అని స్పష్టం చేశారు.

సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వి.లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యత ఎక్కువ కావటం వల్ల 5 కోట్ల మంది జనాభా ఉన్న రాష్ట్రంలో 25 లోక్‌సభ అభ్యర్థుల కోసం 100 కుటుంబాలు, 175 అసెంబ్లీ అభ్యర్థుల కోసం 600 కుటుంబాలు మాత్రమే పోటీలో ఉంటున్నాయని చెప్పారు. ఎన్నికల్లో మద్యం కోసం చేసే ఖర్చు అత్యధికంగా ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత మద్యం వల్లనే ఎక్కువ మంది యువత మద్యానికి బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వలంటీర్లు ప్రభుత్వం నుంచి గౌరవవేతనం తీసుకుంటూ ఒక పార్టీకి ఓటు వేయమని చెప్పటం సమంజసం కాదన్నారు. మీడియా ఎప్పుడూ స్వతంత్రంగా పని చేయలేదని, మీడియా యాజమాన్యాలకు అనుగుణంగా జర్నలిస్టులు పని చేస్తారని చెప్పారు. అయినా సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, మంచి పనులను మీడియా ద్వారానే వెలుగు చూస్తున్నాయన్నారు. ప్రొఫెసర్ ఎంసీ దాస్ మాట్లాడుతూ మీడియా సంస్థలు ఓటు హక్కు, ఓటు వేసే బాధ్యతపై ప్రజలకు అవగాహన కలిగించాల్సి అవసరం ఉందన్నారు. కొన్ని దేశాల్లో ఓటు వేయకపోతే ప్రజలకు ఆంక్షలు విధించే పద్ధతి అమలులో ఉందన్నారు. మన దేశంలో దాదాపు 60 కుంభకోణాలను వెలికితీసింది మీడియానే అన్నారు. జర్నలిస్టులకు కనీస వేతన చట్టం, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని తెలిపారు. రాజ్యాంగ ఉల్లంఘన జరిగిన చోట సుప్రీం కోర్టు కల్పించుకుని చట్టబద్ధ రక్షణ కల్పిస్తేనే జర్నలిస్టులకు ధైర్యం ఉంటుందన్నారు. ఐజేయూ కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడుతూ మీడియా కమిషన్, వేజ్‌బోర్డు ఏర్పాటు, జర్నలిస్టులకు రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. మీడియాలో రూ.3 లక్షల కోట్లు పెట్టుబడులు ఉన్నాయని, వాటిలో 86 శాతం కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చేతిలో ఉన్నట్లు చెప్పారు. పెయిడ్ న్యూస్ వంటి మీడియాలో జరుగుతున్న అవినీతిని ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే బయటపెట్టాయన్నారు. పౌర సమాజం చైతన్యం అయితేనే మీడియాకు స్వేచ్ఛ వస్తుందన్నారు. ఐజేయూ కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేష్‌కుమార్ మాట్లాడుతూ మీడియా యాజమాన్యాలు, జర్నలిస్టులు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి ప్రకటనల రూపంలో డబ్బులు తీసుకుని వారిని విమర్శిస్తూ వార్తలు రాయటం సాధ్యం కాదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓటరుకు మంచి సమాచారాన్ని అందించలేమని తద్వారా ప్రజాస్వామ్యానికి ద్రోహం చేసినట్లు అవుతుందని తెలిపారు. విదేశాల్లో డిజిటల్ మీడియా పెరగటం ద్వారా ప్రజల్లో ఓటు, ఎన్నికల వ్యవస్థపై నమ్మకం పెరిగిందన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ ప్రసంగించారు. ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్షులు చావా రవి స్వాగతం పలికారు. సీనియర్ జర్నలిస్టు ఎస్.కె.బాబు, రామసుబ్బారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు ఏల్చూరి శివ, విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కంచర్ల జయరాజు, కార్యదర్శి దాసరి నాగరాజు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఫొటో జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి రూబిన్ తదితరులు వేదికపై ఆశీనులయ్యారు.

శ్రీనివాసరెడ్డికి ఘన సన్మానం

తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారి విజయవాడకు వచ్చిన కె.శ్రీనివాసరెడ్డిని జర్నలిస్టు సంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. విశాలాంధ్ర సంపాదక వర్గం చైర్మన్ కె.రామకృష్ణ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి చైర్మన్ ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి జల్లి విల్సన్ శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు, కోశాధికారి బీవీవీ కొండలరావు శాలువకప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. విశాలాంధ్ర ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి ఎం.మురళీకృష్ణ అధ్వర్యంలో విశాలాంధ్ర సిబ్బంది సన్మానించారు. వీరితో పాటు నగరంలోని వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు శ్రీనివాసరెడ్డిని ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా సి.రాఘవాచారి సంపాదకీయాల మూడవ సంపుటి 'రాజ్యాంగం, న్యాయస్థానాలు, చట్టసభలు' పుస్తకాన్ని సి.రాఘవాచారి ట్రస్ట్ సభ్యులు అక్కినేని చంద్రరావు, బి.జమిందార్, ఎ.వనజ శ్రీనివాసరెడ్డికి అందజేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. ఆయన్ను అరెస్ట్ చేయడం ద్వారా బీజేపీ పెద్ద తప్పు చేసింది. ఢిల్లీలో లక్షలాది మంది కేజ్రీవాల్‌లు ఉన్నారు. వారు రోడ్లపైకి వస్తారు' అని తెలిపారు. 'పార్టీ ఎలా నడుస్తుందోనన్న సందేహం ప్రజల్లో ఉంది. అరవింద్ కేజ్రీవాల్ ఆదేశాల మేరకు పార్టీ నడుస్తోంది. కొనసాగుతుంది. బయట కంటే జైలు లోపల చాలా బలవంతుడు. బీజేపీ రాజకీయ వ్యూహం విఫలమైంది. కేజ్రీవాల్ ఎక్కడి నుంచైనా ప్రభుత్వాన్ని నడపాలని ప్రజలు ఆయన్ను అడుగుతున్నారు' అని ఆప్ నేత తెలిపారు. మార్చి 31న రాంలీలా మైదానంలో భారీ ర్యాలీ నిర్వహించాలనే ఆదేశాలతో పాటు ప్రభుత్వాన్ని ఎలా నడపాలనే దానిపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నుంచి తనకు తొలి ఆదేశాలు అందాయని పాఠక్ వివరించారు. మార్చి 26న అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు, వార్డు స్థాయి నాయకులు, పార్టీ వాలంటీర్లు పాల్గొనే సన్నాహక సమావేశంతో ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. 'ఢిల్లీలో 13-14 వేల బూత్‌లు ఉన్నాయి. మొత్తం 1.3 లక్షలు లేదా 1.50 లక్షల వరకు పెరుగుతాయి. అందువల్ల మార్చి 31 న రాంలీలా మైదానానికి 1.5 లక్షల (ఒక్కో బూత్ నుంచి పది) తీసుకురావడమే మా లక్ష్యం' అని పాఠక్ చెప్పారు. ర్యాలీ రోజున జైలు నుంచి ప్రజలకు కేజ్రీవాల్ తన సందేశాన్ని తెలియజేస్తారని అన్నారు. 'దేశ ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి', అరవింద్ కేజ్రీవాల్‌కు సంఘీభావంగా నిలబడటానికి మార్చి 31న ఆప్, ఇండియా కూటమి చెందిన అన్ని పార్టీలు సంయుక్తంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.

దర్యాప్తు సంస్థల దుర్వినియోగం : పంజాబ్ సీఎం మాన్

బీజేపీ నేతృత్వంలోని కేంద్రం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఆదివారం ఆరోపించారు. 'నరేంద్ర మోదీ ప్రభుత్వ నియంతృత్వాన్ని, కేంద్ర సంస్థల దుర్వినియోగాన్ని మేము మా శక్తితో వ్యతిరేకిస్తాం' అని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

ఆప్ లక్ష్యంగా పోలీసుల మోహరింపు

కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా ఆప్ చేపట్టిన నిరసనలను అడ్డుకునే లక్ష్యంగా ఢిల్లీ పోలీసు బలగాలను మోహరించారని ఆప్ నాయకుడు కుల్దీప్ కుమార్ కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. నాలుగేళ్ల బాలికపై అత్యాచారం కేసును ప్రస్తావిస్తూ, మహిళలకు రక్షణ కల్పించడమే ఢిల్లీ పోలీసుల అసలు కర్తవ్యమని అన్నారు. 'ఆప్ పార్టీ కార్యాలయాలు, ఆప్ కార్యకర్తలు నిరసనలు తెలిపే ప్రదేశాల వద్ద ఢిల్లీ పోలీసుల బృందాలను మోహరించారు. ఢిల్లీ మహిళలకు రక్షణ కల్పించే తమ అసలు కర్తవ్యానికి బదులు ఆప్ కార్యకర్తలు నిరసనలు చేయకుండా ఆపేందుకు వివిధ పోలీసు స్టేషన్లకు చెందిన అధికారులకు డ్యూటీ ఇచ్చారు' అని ఆయన విలేకరుల సమావేశంలో తెలిపారు. 'ఈ రోజు మేము (ఆప్ నాయకులు) ఢిల్లీ వీధుల్లోకి రాలేదు. ఢిల్లీ ప్రజలే వచ్చారు. సీఎంను అరెస్ట్ చేసి జైల్లో ఎందుకు పెట్టారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు' అని అన్నారు.

జైలు నుంచే కేజ్రీవాల్ పాలన

(మొదటిపేజీ తరువాయి)

విషయాన్ని ఢిల్లీ నీటి పారుదల శాఖ మంత్రి అతిశికి నోట్ ద్వారా తెలిపినట్లు పేర్కొన్నాయి. కాగా దీనిపై మంత్రి అతిశి స్పందిస్తూ ముఖ్యమంత్రి జైలులో ఉండి తనకు ఆదేశాలు జారీ చేయటం బాధగా అనిపిస్తోందన్నారు.ఇలాంటి పరిస్థితుల్లో కూడా ఢిల్లీ ప్రజల గురించి ఆలోచించడం ఆయన గొప్పతనమన్నారు. కేజ్రీవాల్ జారీ చేసిన ఉత్తర్వులను ఆమె చదివి వినిపించారు. 'ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలు నీరు, మురుగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని నేను తెలుసుకున్నాను. ఈ విషయం గురించి నేను ఆందోళన చెందుతున్నాను. నేను జైలులో ఉన్నందున ఎలాంటి సమస్యలను ప్రజలు ఎదుర్కొకూడదు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్లు ఏర్పాటు చేయాలి. ప్రజలను ఇబ్బందులు కలగకుండా అధికారులకు తగిన ఆదేశాలను జారీ చేయాలి' అని కేజ్రీవాల్ తెలిపినట్లు అతిశి పేర్కొన్నారు. ఒక వేళ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసినా, ఆయనే సీఎంగా కొనసాగుతారనీ అవసరమైతే జైలు నుంచే పాలన సాగిస్తారని ఇప్పటికే ఢిల్లీ మంత్రులు స్పష్టం చేశారు. ఇందుకు చట్టపరంగా ఏ విధమైన అడ్డంకులు లేనప్పటికీ జైలు నిబంధనలు దీనిని అవరోధాలుగా నిలుస్తాయని న్యాయనిపుణులు చెబుతున్నారు. ఒక ఖైదీకి స్నేహితులు, కుటుంబీకులు, ఇతర వ్యక్తులతో వారానికి 2 సార్లు సమావేశమయ్యే అవకాశం ఉంటుందని వివరించారు. కేజ్రీవాల్‌ను గృహ నిర్బంధం చేస్తే ఆయనకు పాలన సులభతరం అవుతుందని, అయితే అలా చేసేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సక్సెనా అనుమతి తప్పనిసరిగా ఉండాలి. కాగా కేజ్రీవాల్ ఇంకా సీఎం పదవికి రాజీనామా చేయకపోవడాన్ని కేంద్ర హోంశాఖ పరిశీలిస్తోందని, ఆయనను తొలగించేందుకు న్యాయపరమైన మార్గాలు అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది.

బీజేపీ సీనియర్లకు మొండిచేయి

(మొదటిపేజీ తరువాయి)

నరసాపురం ఎంపీ స్థానం బీజేపీకి దక్కితే, తనకే టికెట్ వస్తుందని ఆశించినప్పటికీ, భంగపాటుకు గురయ్యారు. బీజేపీకి కేటాయించిన ఆరు స్థానాలను ప్రకటించగా, అందులో నరసాపురం నుంచి శ్రీభూపతిరాజు శ్రీనివాస్ వర్మకు బీజేపీ అధిష్టానం కేటాయించింది. 2019 ఎన్నికల్లో వైసీపీ ఎంపీగా నరసాపురం నుంచి రఘురామకృష్ణరాజు గెలిచి, కొద్ది నెలల్లోనే అధిష్టానంపై తిరుగుబావుటా ఎగురవేశారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయడమే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి పొత్తుల్లో భాగంగా ఏ పార్టీ నుంచి అయినా నరసాపురం నుంచి పోటీ చేయాలని పెద్దఎత్తున ఆశించగా, ఊహించని రీతిలో ఆయనకు బీజేపీ అధిష్టానం షాక్ ఇచ్చింది. ఈ సీటు కోసం ఢిల్లీ కేంద్రంగా ఆయన ఎంత ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. బీజేపీలోని మరికొంతమంది సీనియర్ నేతలు జీవీఎల్, మాధవ్, సోము వీర్రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యకుమార్ పేర్లు ఎక్కడా కనిపించలేదు. వివిధ పార్టీల నుంచి వలసలు వచ్చిన వారికే బీజేపీ ఎంపీ సీట్లలో స్థానం లభించింది. అసలైన బీజేపీ నేతలకు టికెట్లు దక్కలేదనే విమర్శలున్నాయి. టికెట్లు పొందిన వారంతా టీడీపీ అధినేత చంద్రబాబుకు సన్నిహితులుగా మెలుగుతున్నారు. అనేక కేసులు ఉన్న వారికి సైతం బీజేపీ ఎంపీ జాబితాలో సీట్లు ఇవ్వడంపై రాష్ట్ర నేతలు అసంతృప్తితో ఉన్నారు.

ఐసిస్‌తో సంబంధాలు... ఐఐటీ విద్యార్థి అరెస్టు

గువహటి: ఐఐటీ గువహటి నాల్గో సంవత్సర బయోటెక్నాలజీ విద్యార్థి తౌసీఫ్ అలీ ఫరూకీ ఆదివారం చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం 'ఉపా' కింద అరెస్టయ్యారు. అతనిని తొలుత అసోం పోలీసుల ఎస్‌టీఎఫ్ అదుపులోకి తీసుకుంది.ఈ విద్యార్థికి ఐసిస్ ఉగ్రసంస్థతో సంబంధాలు ఉన్నట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నట్లు ఎస్టీఎఫ్ ఐజీ మహంతా తెలిపారు. దర్యాప్తు క్రమంలో విషయం తెలిసిందని, అనంతరం అరెస్టు చేశామని చెప్పారు. ఐసిస్‌లో చేరిన తర్వాత లింకడ్ ఇన్‌లో తన నిర్ణయానికిగల కారణాలు తెలుపుతూ ఫరూకీ బహిరంగ లేఖ రాశారు. గువహతిలోని పాన్ బజార్ నుంచి విద్యార్థి అపహరణకు గురయ్యాడని, అనంతరం ఐసిస్‌లో చేరినట్లు మెయిల్ ద్వారా ప్రకటించాడని, ఈ మొత్తం పరిణామంపై దర్యాప్తు జరుగుతోందని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. జార్ఖండ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గోవా, పంజాబ్, మహారాష్ట్ర, కర్నాటకలో మాడ్యూళ్లను ఏర్పాటు చేసే సంస్థాగత బాధ్యతలను ఫరూకీ నిర్వరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఫరూకీ ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్‌కు చెందిన వాడు కాగా ఎన్‌ఐఏ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు. ఐపీసీతో పాటు ఉపా చట్టంలోని అనేక సెక్షన్ల కింద ఈయనపై కేసు ఉన్నాయి. ఇదిలావుంటే, మార్చి 20న ఐసిస్ ఇండియా హెడ్ హారీస్ ఫరూఖీ అలియాస్ హరీశ్ అజ్మల్ ఫరూఖీ అతని సహచరులలో ఒకరైన అనురాగ్ సింగ్ అలియాస్ రెహాన్‌ను అసోంలోని ధుబ్రిలో అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీలో భగ్గుమన్న అసమ్మతి

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించింది' అని పేర్కొన్నారు. అలాగే మేఘాలయ (షిల్లాంగ్, తురా)లో ఎన్‌పీపీ అభ్యర్థులకు, నాగాలాండ్‌లో ఎన్‌డీపీపీ అభ్యర్థికి మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. అటు మేఘాలయలోనూ పార్టీ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమైంది. అరుణాచల్ ప్రదేశ్ లోక్‌సభ స్థానాల్లో బీజేపీ అభ్యర్థికి ఎన్‌పీపీ మద్దతిస్తున్నందుకు బదులుగా బీజేపీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నదని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, పశ్చిమ అరుణాచల్‌లో కిరణ్ రిజిజు, తూర్పు అరుణాచల్ స్థానానికి తాపిర్ గోవాను బీజేపీ తిరిగి నామినేట్ చేసింది. అసోంలో అసోం గణ పరిషత్, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్‌కు రెండు స్థానాలను వదిలేసి, 11 స్థానాల్లో పోటీ చేస్తోంది. త్రిపురలోని రెండు లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ పోటీ చేస్తోంది.

31న ఢిల్లీలో సేవ్ డెమోక్రసీ ర్యాలీ

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రధాని మోదీ దుర్వినియోగం చేస్తున్నారు' అని గోపాల్ రాయ్ మండిపడ్డారు.

మహా ర్యాలీ రాజకీయ సభ కాదు

మార్చి 31న జరిగే మహా ర్యాలీ రాజకీయ సభ కాదని, దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడే పిలుపు అని కాంగ్రెస్ అధ్యక్షుడు అర్విందర్ సింగ్ లవ్లీ పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ సర్కారుకు వ్యతిరేకంగా గొంతు వినిపించే వేదిక అన్నారు. 'మనదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది. దాన్ని కాపాడేందుకు మా నాయకుడు రాహుల్ గాంధీ పోరాడుతున్నారు. ఈ పోరాటంలో ఇండియా కూటమిలోని పార్టీలకు అండగా మేం ఉంటాం' అని ఆయన స్పష్టం చేశారు. చివరకు కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయించేందుకు కూడా బీజేపీ సర్కారు తెగబడిందని అర్విందర్ విమర్శించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ర్యాలీ: అతిశి

'మహా ర్యాలీ' కేజ్రీవాల్‌ను రక్షించడానికి కాదు, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి అని ఢిల్లీ మంత్రి అతిశి అన్నారు. "ఇండియా కూటమి రాంలీలా మైదానంలో 'మహా ర్యాలీ'ని నిర్వహిస్తోంది. ఇది అరవింద్ కేజ్రీవాల్‌ను రక్షించడానికి కాదు, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి. బీజేపీ ప్రతిపక్షంపై ఏకపక్ష దాడులు చేస్తోంది" అని ఆమె అన్నారు. లోక్ సభ ఎన్నికల వేళ ప్రతిపక్ష నేతలపై కేంద్ర ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందని శుక్రవారం ఇండియా కూటమి నేతలు కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలోనే అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ జరిగిందని వివరించారు.

జైలు నుంచి కేజ్రీవాల్ పాలనపై ఈడీ దృష్టి

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉండి పరిపాలన సాగిస్తున్నారు. ఆయన ఆదివారం తాగునీరు, పారుశుద్ధ్య పనులకు సంబంధించి మంత్రి అతిశికి కొన్ని సూచనలు చేశారు. ఈ వ్యవహారాన్ని ఈడీ పరిగణనలోకి తీసుకుంది. ప్రత్యేక మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) ప్రకారం అరెస్టుకు గురైన ముఖ్యమంత్రి ఇలా ఆదేశాలు ఇవ్వొచ్చా అన్నది విచారించనుంది. కాగా, ఈనెల 28 వరకు కేజ్రీవాల్‌ను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. తన భార్య సునీతా కేజ్రీవాల్, పీఏ వైభవ్ కుమార్‌ను రోజుకు అర గంట అదీ సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్యలో కలిసేందుకు అనుమతిచ్చింది. అలాగే న్యాయవాదులతోనూ మరో అర గంట సమావేశమయ్యేందుకు ఆస్కారం కల్పించింది.

లెఫ్ట్ ఘన విజయం

(మొదటిపేజీ తరువాయి)

గెలుచుకున్నారు. సమీప ప్రత్యర్థి, ఏబీవీపీ అభ్యర్థి గోవింద్ డాంగి చిత్తు కాగా ఆయనకు 2,496 ఓట్లు వచ్చాయి. దీంతో మొత్తం నాలుగు స్థానాలు యునైటెడ్ లెఫ్ట్ కైవసమయ్యాయి. నాలుగేళ్ల తర్వాత జేఎన్‌యూలో ఎన్నికలు జరిగాయి. మార్చి 22న రికార్డు స్థాయిలో 73శాతం ఓటింగ్ జరిగింది. గత 12 ఏళ్లలో ఇన్ని ఓట్లు రావడం ఇదే తొలిసారి. 2019లో 67.9 శాతం ఓటింగ్ నమోదైంది. ఈసారి ఎన్నికల్లో మొత్తం ఏడున్నర వేల మందికిపైగా విద్యార్థులు ఓటేశారు. ఓటింగ్ కోసం 17 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. జేఎన్‌యూఎస్‌యూ సెంట్రల్ ప్యానల్ కోసం 19 మంది పోటీ చేశారు. కాగా, యునైటెడ్ లెఫ్ట్‌లో ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఎఫ్), డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (డీఎస్‌ఎఫ్), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఎఫ్‌ఐ), ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) ఉన్నాయి.

భూ మాఫియాకు చేనేత కుటుంబం బలి

- దోషులను కఠినంగా శిక్షించాలి
- మృతుల కుటుంబానికి న్యాయం చేయాలి
- ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర-ఒంటిమిట్ట: వైసీపీ పాలనలో భూమాఫియా ఆగడాలకు అంతులేకుండా పోయిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులు జి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చెందిన చేనేత కుటుంబం పాల సుబ్బారావు, భార్య పద్మావతి, కుమార్తె వినయ ఆత్మహత్యకు కారకులైన రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పూర్తిస్థాయి విచారణ జరిపించి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. మృతుల కుటుంబానికి రూ.కోటి పరిహారం, పెద్ద కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మాధవరంలో మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత జిల్లా కడపలో అధికారులు, అధికార పార్టీ నేతల భూ దాహానికి అమాయక కుటుంబం బలికావడం విచారకరమన్నారు. మృతుడు సుబ్బారావు తండ్రి చలపతి సోమశిల ప్రాజెక్టు నిర్మాణం కోసం అట్లూరు మండలంలోని భూములు, ఇల్లు త్యాగం చేసి ఒంటిమిట్ట మండల మాధవరంలో నివాసం ఉంటున్నారని...ఒంటిమిట్ట గ్రామంలో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసు కుంటూ రెవిన్యూ రికార్డుల్లో కూడా నమోదు చేయించుకున్నా రన్నారు. అయితే చలపతి కరోనా సమయంలో చనిపోగా తన రెండో కుమారుడైన సుబ్బారావు తండ్రి బాధ్యతలు స్వీకరించారన్నారు. ఇద్దరు కుమార్తెల చదువు, తమ్ముడు వివాహానికి సంబంధించిన ఆర్థికావసరాలు ఒకవైపు, అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి మరోవైపు రావడంతో తన తండ్రి ద్వారా సంక్రమించిన మూడు ఎకరాల భూమిని విక్రయించడానికి సిద్ధపడ్డారన్నారు. అయితే మండల తహసిల్దారు, స్థానిక వైసీపీ నాయకులు కుమ్మక్కై తన తండ్రి చలపతి పేరు మీద ఉన్న భూమిని మరొకరి పేరు మీద నమోదు చేయడం... ముడుపులు ముట్టజెపుతూ అనేక పర్యాయాలు రెవిన్యూ అధికారుల చుట్టూ తిరిగినా స్పందించకపోవడంతో గత్యంతరం లేక కుటుంబం మొత్తం ఆత్మహత్యకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు భూమి పక్కనే నాలుగు లైన్ల రహదారి నిర్మాణం జరగడం, వీరి అనుభవంలో ఉన్న భూమి విలువ పెరగడంతో అధికారులు , అధికార పార్టీ నేతలు కుమ్మక్కై భూమి వివరాలు నమోదు చేయడంలో భారీ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో విలువైన ప్రభుత్వ వంక, వాగు, చెరువు, రాస్తా, అసైన్డ్, దేవాదాయ, ఈనామ్ భూములను ఆక్రమించుకొని అమ్ముకొని సొమ్ము చేసుకునే డీకేటీ మాఫియా దుర్మార్గాల తో సామాన్య పేద మధ్యతరగతి ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం మాఫియా కొమ్ముకాస్తోందని దుయ్యబట్టారు. ఒంటిమిట్ట మండలంలో భూ ఆక్రమణలపై

పత్రికల్లో, టీవీల్లో పుంకాను పుంకాలు గా కథనాలు వస్తున్నా అధికారులకు, అధికార పార్టీ నేతలకు చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. ఒకే భూమిపై రెండు హక్కు పత్రాలు తయారు చేసే డీకేటీ మాఫియా మండలంలో తయారయిందన్నారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబం రాసిన లేఖ ప్రాతిపదికగా తీసుకొని పూర్తిస్థాయి విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. మృతుల కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, పెద్దకుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు డీఎస్పీ షరీఫ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.వెంకట శివ, మండల కార్యదర్శి యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యపై విచారణ జరపాలి

విశాలాంధ్ర-మంగళగిరి: అధికారులు, అధికార పార్టీ నాయకులు వేధింపుల కారణంగానే వైఎస్సార్ కడప జిల్లాలో చేనేత కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం మంగళ గిరిలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సుబ్బారావు తన పొలాన్ని అమ్ముకొని కుమార్తెకు వివాహం చేయాలని అనుకున్న సమయంలో పొలం నీది కాదంటూ అధికారులు అడ్డం తిరిగారన్నారు. అధికార పార్టీ నాయకులు ఆన్‌లైన్‌లో ఉన్న పొలాల్ని కూడా కబ్జా చేస్తున్నారన్నారు. ఈ సంఘటనపై రిటైర్డ్ జడ్జి అధ్వర్యంలోని ప్రత్యేక కమిటీ చేత విచారణ జరిపించి దోషులపై చర్యలు తీసుకోవాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మృతి చెందిన సుబ్బారావు పెద్ద కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రే షియా ప్రకటించాలన్నారు. కోల్పోయిన పొలాన్ని కూడా సుబ్బారావు ఆమెకు తిరిగి ఇప్పించాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తూరి మోహన్‌రావు, గజవల్లి వెంకట కృష్ణారావు, మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు బత్తుల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కుర్చీ పైనే కన్ను!

- వ్యక్తిగత దూషణలకే ప్రాధాన్యం
- ప్రజాసంక్షేమం పట్ల వైనం
- అమలుకాని హామీలతో వంచన

విశాలాంధ్ర-డిజిటల్: రాజకీయాలు కట్టుతప్పుతున్నాయి. నేతల మాటలు తూటాలై తగులుతున్నాయి. సంప్రదాయ రాజకీయాలకు సమాధికడుతూ పార్టీ అధినేతలు సైతం నోటికి ఇష్టమొచ్చినట్టు పని చెబుతున్నారు. తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామో ప్రజలకు చెప్పకుండా ప్రతిపక్షమూ... అధికార పక్షమూ అన్న తేడా లేకుండా అన్ని పార్టీల నేతలు నోటిదురుసు ప్రదర్శిస్తుండడం ప్రజలకు మింగుడుపడడం లేదు. ఓటరు ఏం చేయాలో తెలియక తికమకపడుతున్నారు. వ్యక్తిగత దూషణలకు దిగుతుండడంతో తలలు బాదుకుంటున్నారు. సీఎం కుర్చీని ఆశించి సొంత పార్టీ పెట్టిన ఓ నేత సభకు వచ్చిన జనసమూహాన్ని చూసి పూనకం వచ్చిన పోతురాజులా ఊగిపోతూ చెప్పు పైకి చూపుతూ బట్టలూడదీసి కొడతా, రోడ్లపై పరుగులు తీయిస్తా నా.... అంటూ ఊగిపోతుంటే ఓటు హక్కులేని యువత కేరింతలు కొట్టడంతో మరింత రెచ్చిపోవడాన్ని ఓటర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి కూడా ప్రతిపక్షాలనే లక్ష్యంగా చేస్తూ ముగ్గురు పెళ్లాలంటూ... భార్యలను మార్చినంత తేలిక కాదు రాజకీయం అంటూ వ్యక్తిగత దూషణలకు దిగడాన్ని సైతం హర్షించలేకపోతున్నారు. ఓ పార్టీ జాతీయ కార్యదర్శిగా ఉంటూ తాము అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తామో చెప్పకుండా సీఎం... నీ అంతుచూస్తా... అధికారంలోకి రాగానే నీ పనిపడతా అంటూ బహిరంగంగానే హెచ్చరికలు జారీ చేస్తుండడం రాజకీయ సంప్రదాయానికి సమాధి కడుతున్నట్టుగా పామరులు సైతం భావిస్తున్నారు. తమ కంటే ఓటరే తెలివైన వాడన్న సంగతి మరచి మైక్ అందుకుని మరీ రెచ్చిపోతుండడాన్ని టీవీల్లో రిపీటెడ్‌గా చూస్తూ రాజకీయాలు ఎలాంటి వైపరీత్యాలకు దారితీస్తాయోనని సామాన్యుడు సైతం భయపడడం వంతైంది. అమలు కాని హామీలిస్తూ అధికారం చేజిక్కించుకునేందుకు పడే ఆరాటం చూసి నెత్తీనోరూ కొట్టుకుంటున్నారు. పార్టీ బ్రాండే తమకు బలమని తెలుసుకోలేని కొందరు నేతలు వాపును బలుపనుకుని అధినేతలను బెదిరిస్తూ టికెట్ దక్కకుంటే ఇతర పార్టీల్లో చేరిపోవడం ట్రెండ్‌గా మారిన నేపథ్యంలో గెలుపు సన్నగిల్లుతుందన్న విషయం అనుభవపూర్వకంగానైనా తెలుసుకోలేకపోవడం సీనియర్ నాయకుల అజ్ఞానానికి నిదర్శనం. సొంత నియోజకవర్గంలోనే తిరస్కరణకు గురైన మాజీలు సైతం టికెట్ ఆశించి పార్టీలు మారి పొరుగు జిల్లాల్లో పరిచయం లేని చోట పోటీకి దిగితే ఓటర్లు ఎలా స్వీకరిస్తారని ఆలోచించకపోవడం ప్రథమ తప్పిదంగా రాజకీయ కురువృద్ధులు విశ్లేషిస్తున్నారు. ఇది ఏ ఒక్క పార్టీకో పరిమితం కావడం లేదు. వామపక్ష పార్టీలు మినహా అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీల్లోనూ ఈ జాఢ్యం వేళ్లూనుకుంది. ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే సీనియర్ అధినేత సైతం సీఎంను ఇంటికి పంపేవరకూ నిద్రపోను అని శపథం చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందంటున్నారు. కుర్చీ పైనే కన్ను తప్ప... ప్రజా పాలన పట్టడం లేదంటూ మచ్చలేని రాజకీయవేత్త రాష్ట్రంలోనే కాదు... దేశంలోనూ... ప్రపంచంలోనే లేడంటూ బల్లగుద్ది మరీ చెబుతున్నారు.

అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్‌గా నీలం రమేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అనుబంధ సంస్థ అయిన అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ గా నీలం రమేశ్‌ను నియమించినట్టు పీసీసీ ప్రధాన కార్యదర్శి (అడ్మినిస్ట్రేషన్) ఎస్.ఎన్. రాజా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కోదండరెడ్డిని ఆంధ్రప్రదేశ్‌కు ఇన్‌ఛార్జ్‌గాను, నీలం రమేశ్, రష్మి రంజన్ పట్నాయక్, షకీనా పటేల్‌ను కో ఇన్‌ఛార్జ్‌లుగా నియమించారు.

మాదకద్రవ్యాల నియంత్రణలో వైసీపీ వైఫల్యం

'విశాఖ' డ్రగ్స్ మాఫియా గుట్టు సీబీఐ బయటపెట్టాలి

విద్యార్థి యువజన సంఘాల డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: మాదకద్రవ్యాలను అరికట్టడంలో వైసీపీ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విద్యార్థి యువజన సంఘాల నేతలు ఆరోపిం చారు. వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్‌పేటలోని దాసరి నాగభూషణరావు భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము మాట్లాడుతూ విశాఖపట్నంలో 25 వేల కిలోల డ్రగ్స్ దొరికినా దాని వెనుక ఉన్న మాఫియాను సీబీఐ బయట పెట్టకుండా కాలయాపన చేస్తుండడం దుర్మార్గమన్నారు. ఇంటర్‌పోల్ సహాయంతోనే కంటైనర్‌ను పట్టుకున్నామని సీబీఐ చెబుతుంటే తీరప్రాంతాల్లో ఉన్న ఇంటలిజెన్స్ విభాగం ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. సీబీఐ నిర్వహించిన పరీక్షల్లో కొకైన్, హెరాయిన్ వంటి డ్రగ్స్ పదార్థాలు కలిసి ఉన్నట్లు పరీక్షల్లో తేలిందని, సంధ్య ఆక్వా కంపెనీ నుంచి ఎవరెవరికి ఈ పదార్థాలను సరఫరా చేస్తున్నారో సీబీఐ బయట పెట్టాలని డిమాండ్ చేశారు. టీడీపీ, వైసీపీ, బీజేపీ... అ మూడు పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసు కుంటున్నారే తప్ప డ్రగ్స్ మాఫియా వెనుక ఉన్న వారిని కఠినంగా శిక్షించాలని ఎందుకు చెప్పడం లేదో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దానన్న సీఎం జగన్... దేశంలోనే గంజాయి సరఫరాలో మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని నార్కోటిక్ సంస్థ చెప్పడం సిగ్గుచేటన్నారు. విద్యార్థులు, యువకులను మాదకద్రవ్యాలకు అలవాటు చేసి వారి జీవితాలను నాశనం చేస్తున్నారే తప్ప డ్రగ్స్‌ను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదకద్రవ్యాలను నియంత్రిస్తూ డ్రగ్స్ మాఫియాపై ఉక్కు పాదం మోపేలా చట్టాలు తీసుకొస్తామని తమ మేనిఫెస్టోలో చేర్చాలని విద్యార్థి యువజన సంఘాలు నేతలు కోరారు. ఏఐవైఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి లంకా గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు నాసర్ జి, అయ్యప్ప పాల్గొన్నారు.

పిఠాపురం నుంచి పవన్ పోటీ

- 11 మంది అసెంబ్లీ అభ్యర్థులు అధికారికంగా ప్రకటన
- పెండింగ్‌లో అవనిగడ్డ, పాలకొండ, విశాఖ (దక్షిణ)
- జనసేన జాబితా విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే సార్వత్రి ఎన్నికల్లో జనసేన 11 మందితో అభ్యర్థుల జాబితాను ఆదివారం రాత్రి ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. తొలుత ఐదు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, అనంతరం మరో రెండు స్థానాలకు అభ్యర్థులను జనసేన వెల్లడించింది. మొత్తం 18 స్థానాలకుగాను అభ్యర్థులు ఖరారయ్యారు. అవనిగడ్డ, పాలకొండ, విశాఖపట్నం (దక్షిణ) స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. కాకినాడ లోక్‌సభ స్థానం నుంచి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను ఇటీవల ప్రకటించారు. 18 అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన జాబితా వివరాలిలా ఉన్నాయి. పిఠాపురం-పవన్ కల్యాణ్, నెల్లిమర్ల-లోకం మాధవి, అనకాపల్లి-కొణతాల రామకృష్ణ, కాకినాడ రూరల్-పంతం నానాజీ, రాజానగరం-బత్తుల బలరామకృష్ణ, తెనాలి-నాదెండ్ల మనోహర్, నిడదవోలు-కందుల దుర్గేశ్, పెందుర్తి-పంచకర్ల రమేశ్‌బాబు, యలమంచిలి-సుందరవరపు విజయ్‌కుమార్, పి.గన్నవరం-గిడ్డి సత్యనారాయణ, రాజోలు-దేవి వరప్రసాద్, తాడేపల్లిగూడెం-బొలిశెట్టి శ్రీనివాస్, భీమవరం-పులవర్తి ఆంజనేయులు, నరసాపురం-బొమ్మిడి నాయకర్, ఉంగుటూరు-పచ్చమట్ల ధర్మరాజు, పోలవరం - చిర్రి బాలరాజు, తిరుపతి- ఆరణి శ్రీనివాసులు, రైల్వే కోడూరు-యనమల భాస్కరరావు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనాలు

ప్రభాకర్‌రావే కీలక సూత్రధారి: పోలీసులు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనం రేపుతోంది. ఈ కేసులో మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావును ఏ1గా నిందితుడిగా పోలీసులు చేర్చారు. ఏ1 ప్రభాకర్‌రావు, ఏ2 ప్రణీత్‌రావు, ఏ3 రాధాకిషన్, ఏ4 భుజంగరావు ఏ5 తిరుపతన్న, ఏ6 ప్రైవేట్ వ్యక్తి పేరును చేర్చినట్లు ప్రకటించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావే కీలక సూత్రధారి అని పోలీసులు గుర్తించారు. ప్రభాకర్‌రావు కనుసన్నల్లోనే ట్యాపింగ్ జరిగిందని తెలిపారు. ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే ట్యాపింగ్ డివైజ్‌లు, హార్డ్ డిస్క్‌లను ప్రణీత్‌రావు ధ్వంసం చేశాడని చెప్పారు. ప్రణీత్‌రావు ధ్వంసం చేసిన హార్డ్ డిస్క్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చెడిపోయిన ట్యాపింగ్ డివైజ్‌ను పునరుద్ధరించే ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రణీత్‌రావు సహా ఇద్దరు అదనపు ఎస్పీలకు రిమాండ్

ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు, అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలకు నాంపల్లి కోర్టు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించించారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలకు శనివారం అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం ఉదయమే వారిద్దరికి గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరచగా... వీరికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో పంజాగుట్ట పోలీసులు వీరిని చంచల్‌గూడా జైలుకు తరలించారు. యథేచ్ఛగా ఫోన్‌ట్యాపింగ్‌లకు పాల్పడిన వ్యవహారంలో ప్రణీత్‌తోపాటు వీరిద్దరి పాత్రను గుర్తించిన దర్యాప్తు అధికారులు వారిని అరెస్ట్ చేశారు. రాజకీయ ప్రముఖుల, వ్యాపారుల ఫోన్లను ట్యాప్ చేయడంలో వీరిద్దరి ప్రమేయం గురించి కీలకాధారాలను సేకరించే పనిలో దర్యాప్తు బృందం నిమగ్నమైంది. భుజంగరావు ఎన్నికల ముందు వరకు పొలిటికల్ ఇంటెలిజెన్స్ విభాగంలో, తిరుపతన్న ఎస్ఐబీలో అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తించారు. కాగా ఈ వ్యవహారంలో ఇప్పటికే ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, ఓ మీడియా సంస్థ నిర్వాహకుడు శ్రవణ్ రావుకు పాత్ర ఉన్నట్లు గుర్తించారు. ఈ ముగ్గురూ ఇప్పటికే దేశం దాటినట్లు వెల్లడి కావడంతో లుక్‌అవుట్ సర్క్యులర్ జారీ చేశారు. ప్రభాకర్ రావు అమెరికా, రాధాకిషన్ లండన్, శ్రవణ్‌రావు నైజీరియాలో ఉన్నట్టు సమాచారం. వీరితో పాటే విచారణకు రావాలని గతంలో ఎస్ఐబీలో పనిచేసిన తొమ్మిది మందికి నోటీసులిచ్చారు. ప్రణీత్‌రావు ఫోన్‌ట్యాపింగ్ సొంత నిర్ణయంతో జరిగింది కాదని.. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన కొందరు నేతల కారణంగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్టు ప్రత్యేక దర్యాప్తు బృందం భావిస్తోంది.

బహిర్గతమైన రిమాండ్ రిపోర్టు

ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న రిమాండ్ రిపోర్ట్ బహిర్గతమైంది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు చెబితేనే ట్యాపింగ్‌కు పాల్పడినట్లు ప్రణీత్, భుజంగరావు, తిరుపతన్న తెలిపారు. 7 రోజుల విచారణలో ప్రణీత్‌రావు కీలక విషయాలు బయటపెట్టారు. భుజంగరావు, తిరుపతన్న ఇచ్చిన నెంబర్లను ప్రణీత్ ట్యాప్ చేశారు. ఎన్నికల సమయంలో వందలాది రాజకీయ నేతలు, వారి కుటుంబసభ్యుల ఫోన్లను ట్యాప్ చేశానని, రాజకీయ నేతలు కదలికలు, నిధుల సమీకరణపై దృష్టిపెట్టానని ప్రణీత్‌రావు వెల్లడించినట్లు తెలిసింది. వ్యాపారవేత్తలతో పాటు సమాజంలో పేరు ఉన్న వారి ఫోన్లను కూడా టాప్ చేశామని, ట్యాపింగ్ సంబంధించిన మెయిన్ డివైజ్‌ని పూర్తిగా ధ్వంసం చేశామని, 17 కంప్యూటర్లలో ఉన్న హార్డ్ డిస్క్‌లు అన్నిటిని ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

లోకేశ్ కాన్వాయ్ తనిఖీ... పోలీసుల తీరుపై ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కాన్వాయ్‌ను ఆదివారం పోలీసులు తనిఖీ చేశారు. ఉండవల్లి కరకట్ట వద్ద ఆయన కాన్వాయ్‌ను రెండు సార్లుగా తనిఖీ చేయడంపై ఆ పార్టీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల్లో నాలుగు సార్లు కాన్వాయ్‌ను తనిఖీ చేయడంతో... వైసీపీ నేతల కాన్వాయ్‌ను ఎందుకు తనిఖీలు నిర్వహించడం లేదంటూ లోకేశ్ పోలీసులను ప్రశ్నించారు. మంగళగిరి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న తన కారును పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేయడంపై ఆయన మండిపడ్డారు. తన కాన్వాయ్ కోడ్‌కు విరుద్ధంగా లేదని స్పష్టం చేశారు. సీఎం జగన్ ఆదేశాల మేరకే పోలీసులు ఈ తరహాగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మంగళగిరిలో జగన్ బొమ్మలు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉన్నప్పటికీ, ఎందుకు తొలగించలేదని లోకేశ్ ప్రశ్నించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాజకీయ నేతల కాన్వాయ్‌లు, వారి వాహనాలపై పోలీసులు ప్రధాన దృష్టి పెట్టారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో మంత్రి దాడిశెట్టి కాన్వాయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పిఠాపురంలో పర్యటిస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీతపై అనుమతులు చూపాలని పోలీసులు నిలదీశారు. అన్ని రాజకీయ పార్టీలకు కోడ్ ఉల్లంఘన పెద్ద సమస్యగా మారింది. ఇంతకాలంపాటు ఎంతో స్వేచ్ఛగా తిరిగిన నేతలంతా ఎన్నికల కోడ్‌తో పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీలకు సహకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మోదీ కబంధహస్తాల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

ప్రత్యేకహోదా-విభజన హామీల సాధన సమితి పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: మోదీ కబంధ హస్తాలనుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని, రాష్ట్ర హక్కులను సాధించు కోవాలని ప్రత్యేక హోదా-విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కొత్తపేటలో ఉన్న మల్లయ్య లింగం భవనంలో సమితి అధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో చలసాని మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శాసన వ్యవస్థను చేతుల్లోకి తీసుకుందని, న్యాయస్థానాలను బెదిరించే స్థితికి చేరడం ఆవేదన కలిగించే అంశమన్నారు. ఆఖరికి తెలుగు మీడియాను కూడా కబ్జా చేసే పరిస్థితిలో బీజేపీ ఉండటంతో ప్రజాస్వామ్య గొంతుక వినిపించదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రాఫ్ రోజు రోజుకు తగ్గిపోతున్న నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబుతో పొత్తులు పెట్టుకుందన్నారు. 0.5 శాతం ఓట్లు రాని బీజేపీతో 46 శాతం ఓట్లు వచ్చిన వారు పొత్తు పెట్టు కోవడం ఏంటని ప్రశ్నించారు. టీడీపీలోనే 95శాతం మందికి ఇది ఇష్టం లేదన్నారు. రాష్ట్ర హక్కులు కాపాడు కోవాలంటే బీజేపీని ఓడించక తప్పదని పిలుపునిచ్చారు. సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ... మన రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై గత పదేళ్లుగా సమితి అనేక పోరాటాలు చేసిందన్నారు. రాష్ట్ర ప్రజల బాగోగులను పట్టించుకోకుండా స్వార్థ ప్రయోజనాల కోసం చంద్రబాబు, పవన్ కల్యాణ్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మోదీకి సరెండర్ అయ్యారని ఎద్దేవా చేశారు. మోదీ పాలనలో దేశంలో హింస రాజ్యమేలు తోందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ఫ్యాక్టరీ, పోలవరం ఇలా ఏదీ కూడా ఇవ్వకుండా మోసం చేశారన్నారు. మోదీని, బీజేపీని అనేక రకాలుగా విమర్శించిన చంద్రబాబు భవిష్యత్తులో తనను జైలు పాలు చేస్తారేమోనన్న భయంతోనే బీజేపీతో పొత్తు పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు మాట్లాడుతూ ఇండియా కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని, రాజధాని అమరావతి అవుతుందన్నారు. దీనికి రాహుల్ గాంధీ కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని...రాజ్యాంగాన్ని చేతుల్లోకి తీసుకొని ఇష్టారీతిగా బీజేపీ పరిపాలన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధన సమితి జిల్లా అధ్యక్షుడు పీవీ మల్లికార్జునరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బెదిరించి అధికార, అనధికార పొత్తులు కుదుర్చుకుందన్నారు. ఆంధ్రులను అన్ని విధాలుగా మోసం చేస్తున్న భారతీయ జనతా పార్టీని రానున్న ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ సేవ కుమార్ మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర అభివృద్ధి గురించి పట్టించుకోకుండా కేవలం అధికారమే లక్ష్యంగా బీజేపీతో చేతులు కలిపాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పోరాడినప్పుడే రాష్ట్రానికి మంచి జరుగుతుందని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ నరసింహారావు, నగర అధ్యక్షులు కోట మాల్యాద్రి, నాయకులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, బి.వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్ లక్ష్యంగా పోలీసుల తనిఖీలు

అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మూడు రోజుల్లో నాలుగు సార్లు టీడీపీ నేత నారా లోకేశ్ కాన్వాయ్‌ను ఆపి తనిఖీ చేయడమంటే, అది లక్ష్యంకాక, మరేమిటని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. టీడీపీ నేత నారా లోకేశ్ పట్ల ఏపీ పోలీసుల తీరును ఆయన తప్పుపట్టారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ తనిఖీలపై లోకేశ్ ప్రశ్నించగా, కోడ్ అమలులో భాగంగా తనిఖీ చేస్తున్నామంటూ పోలీసులు చెబుతున్నారని, లోకేశ్ వాహనాలు మాత్రమే ఆపాలని పోలీసులకు ఏమైనా స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. అటు అధికార వైసీపీ ముఖ్య నాయకుల కాన్వాయ్‌లు ఎందుకు తనిఖీలు చేయడం లేదని పోలీసులను ప్రశ్నించారు. మంగళగిరిలో సీఎం జగన్ ఫ్లెక్సీలు, బొమ్మలు చాలా చోట్ల ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉన్నాయని, వాటిని సైతం ఎందుకు తొలగించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాడేపల్లి ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవడం మానుకోవాలని మంగళగిరి పోలీసులను హెచ్చరించారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 8 గంటలకు, 23వ తేదీ ఉదయం 8 గంటలకు, ఆదివారం ఉదయం 8.10 నిమిషాలకు, సాయంత్రం 5 గంటలకు లోకేశ్ కాన్వాయ్ ఆపి మరీ పోలీసులు తనికీలు నిర్వహించడంపై మండిపడ్డారు.

మార్క్సిజం మార్గంలో 'మాదిగ పల్లె' నవల

పెనుగొండ లక్ష్మీనారాయణ
అధ్యక్షుడు, అరసం జాతీయ సమితి
సెల్: 9440248778

తెలుగు పాఠకులకు సుపరిచితమైన నవల మాలపల్లి. ఈ నవలపై అనేక చర్చలు జరిగాయి. విమర్శలు, విశ్లేషణలూ వచ్చాయి. ఎన్నో వ్యాసాలు వెలువడ్డాయి. 1922 లో ప్రచురితమైన మాలపల్లి నవలపై గాంధీజీ జాతీయోద్యమ ప్రభావం, 1917 లో రష్యాలో వచ్చిన బోల్షివిక్ ప్రభావం ఉంది. ఈ నవలలోని సంగదాసు దళితుల సంక్షేమం కోసం కృషి చేస్తారు. గాంధీజీ భావజాలంపై అచంచల విశ్వాసం కలిగిన ఉన్నవ లక్ష్మీనారాయణ తక్కెళ్ల జగన్నాథం ద్వారా 'బుర్రకథ' లో చెప్పిన విషయాలు పూర్తి మార్క్సిస్టు అవగాహన, చైతన్యంతో కార్మిక వర్గ పక్షపాతంతో చెప్పినట్లు స్పష్టమౌతుంది. ప్రసిద్ధ సాహితీవేత్త, అనువాదకులు సహవాసి మాలపల్లిని గురించి చెప్పిన అభిప్రాయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తాను. "మార్క్సిజం మూల పురుషుడు కారల్‌మార్క్సు 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి" అని ఇచ్చిన పిలుపునకు ప్రతిధ్వనిగా 'పనివాళ్లందరు ఏకమైతిరా- ప్రపంచమే మీది' అని తత్వం పాడించడం ద్వారా గాంధేయవాది అయిన ఉన్నవ సామ్యవాద వ్యవస్థను సమర్థించారు. మాలపల్లి అనంతరం 76 సంవత్సరాల తరువాత 1998 లో వచ్చిన నవల 'మాదిగపల్లె'. రచయిత పెరుగు నాసరయ్య. వారిది బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం. 1929 లో జననం. బి.ఏ.బి.ఇడి చదివి ప్రధానోపాధ్యాయులుగా రిటైరయినారు. వారు అనేక రచనలు చేశారు. అందులో కూలి విజయం (నాటిక-1952), శ్రామిక గీతాలు (1985), ఈ పోరాటం ఆగదు (కథలు 1993), బాలవీరులు (గేయకథలు 1994), పోరుబాట నవల (1996), కల్లుగీత సత్తెయ్య (నవల), వీరి కథానిక 'బతుకు పోరు' (యానాదుల జీవితంపై- 1994) దేశమంటే ప్రజాసాహితీ కథా సంకెలనం ఆగస్ట్ 1999 లో ప్రచురితం. వీరి ఈ రచనల శీర్షికలే వారి భావాలను ప్రసరిస్తున్నాయి. ప్రస్తుతం ప్రస్తావిస్తున్న ఈ నవల 'మాదిగపల్లె'ను బుక్స్ అండ్ బుక్స్ (విశాఖపట్నం) 1998లో ప్రచురించింది. వంద పుటల నవల యిది. ఈ పుస్తకానికి 'ప్రయాణ దిశ' శీర్షికతో డా.మానేపల్లి సత్యనారాయణ ముందుమాట రాశారు.

అందులో "ఒక బ్రాహ్మణ మేధావి అయిన ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లి నవలను రచించి తమ వర్గానికి మాల, మాదిగలపై గల అభిప్రాయాన్ని వెల్లడించారు. అది ఉత్తమ నవలగా అపారమైన కీర్తి గడించింది. అది మాలపల్లి కాదు. బ్రాహ్మణపల్లి అనే విమర్శ 1990 ప్రాంతంలోనే వినిపించింది. వైష్ణవ భక్తి భావ బోధన మాలపల్లిలో ఎంత బలంగా ఉందో అప్పటికిగాని మనకి గుర్తింపు రాలేదు. (శిల్పరీత్యా మంచి నవల, సమకాలీన చరిత్రకు అద్దం పట్టింది- అనేది వేరే కోణం) మానేపల్లి ఈ విమర్శకు ఏ ఆధారమూ చూపలేదు. ఇప్పుడు దళిత కులంలో పుట్టిన పెరుగు నాసరయ్య మాదిగపల్లె నవల రాశారు. శిల్ప రీత్యా, నిడివిరీత్యా దీనిని మాలపల్లెతో పోల్చలేమనేమాట నిజమే కావచ్చు. దాని చిత్తశుద్ధి? మాలమాదిగల అభివృద్ధిని కాంక్షించే చిత్తశుద్ధి! ఈ విషయంలో మాలపల్లికీ మాదిగపల్లెకు పోలికే లేదు అని మానేపల్లి సత్యనారాయణ తేల్చేశారు.

మానేపల్లి ఇంకా... 'మాల మాదిగలు ఒకరికొకరు శత్రువులయ్యారు. వీరు ఉమ్మడి శత్రువైన అగ్రవర్ణ పాలక వర్గాలని మరిచారు. కోటా ప్రకారం రిజర్వేషన్ల విభజన సంగతి ఎలా ఉంచినా వీరిద్దరూ కలిసి పాలక వర్గ దోపిడీతత్వంపై పోరాటం సాగించాలి. ఆ మేరకైన వారి మధ్య ఐక్యత తప్పనిసరి అని సలహా ఇచ్చారు. తాను మాత్రం వర్గీకరణలో ఎటువైపో తప్పించుకునేధోరణిలో వ్యవహరించారు. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాను. అభ్యుదయ రచయితల సంఘం వర్గీకరణలో మాదిగల వైపు నిలబడింది, కొనసాగిస్తుంది. (ఈ పుస్తకానికి సంపాదకుడిగా కూడ వ్యవహరించిన మానేపల్లి పుస్తక ప్రచురణలోనూ అలాగే పాత్రల పేర్లకు సంబంధించి ఏ మాత్రం జాగ్రత్త వహించలేదు. (ఒకే పేరు సుశీల రెండు పాత్రలకు ఏంది. ఈ పుస్తకాన్ని వేరొకరు ఎవరు ప్రచురించినా వెలుగులోకి వచ్చేది. పుస్తక ప్రచురణ ఖర్చు భరించింది రచయితే.)

రచయిత నాసరయ్య 'చైతన్యం కోసం' శీర్షికన మూడు పుటలలో తన మాట రాసుకున్నారు. ఇందులో 'అస్పృశ్యులు చైతన్యవంతులు కావాలి. ఐకమత్యాన్ని సాధించి పోరాటాలకు నాయకత్వం వహించి అంతిమ విజయం సాధించే వరకు విశ్రాంతి తీసుకోకూడదు. అగ్రవర్ణ ఆధిపత్యాన్ని నేలకూల్చి శ్రామిక వర్గం విజయం సాధించాలి అని ఆశయాన్ని వివరించారు. ఇంకా 'చైతన్యం కోసం' కు అనుబంధంగా 'తాజాకలం' శీర్షికన రాసిన మాటలు ఎంతో ముఖ్యమైనవి. అవి: "ఆంధ్రలో దళితోద్యమము మార్క్సిజము మీద అపనమ్మకముతో సాగుతున్నది. కొన్ని ప్రాంతాలలో మార్క్సిజానికి వ్యతిరేకంగా సాగుతున్నది. అంబేద్కరిజం మార్క్సిజం కంటె గొప్పదనే దురభిప్రాయంతో సాగుతున్నది. నిజం అని దేనిని పిలవాలో నిజానికి నిర్వచనమేమిటో అర్థం చేసుకోకపోవటమో, గుడ్డి వ్యతిరేకతలు మాత్రమే దీనికి కారణం.

పెట్టుబడిదారి సమాజంలో ఏ సమస్యనయినా, ఏ పోరాటాన్నయినా అర్థం చేసుకోవటానికి మార్క్సిజమ్ ముఖ్య ఆధారం. ఆ జ్ఞానం లేక పోవడం మూలముననే దళితోద్యమం చీలికలై మాదిగ దండోరాగా మాల మహానాడుగా చీలి ఒకరిని మరొకరు ద్వేషించుకునే స్థితికి వచ్చారు. సమస్య మీద దోపిడీకి ప్రభుత్వం ఆడుతున్న నాటకాన్ని అర్థం చేసుకోలేని



అసమర్థత బైటపడింది. మార్క్సిస్టు అవగాహనతో మాలమాదిగ ఉద్యమ కారులకు కనువిప్పు కలిగేలా మరో పుస్తకం తీసుకురావడం అవసరం అనుకుంటున్నారు. (లోగడ 'పోరుబాట' నవలను కూడా అస్పృశ్యులలో చైతన్యం కోసం రాశానని కూడా పేర్కొన్నారు) ఈ మాటల ద్వారా నాసరయ్యకు మార్క్సిజంపట్ల ఉన్న జ్ఞానం, విశ్వాసం ఎంతగానో స్పష్టమవుతుంది. ఇటీవల జిగ్నేశ్‌మేవాని అనే శాసనసభ్యుడు, దళిత ఉద్యమనేత 'కమ్యూనిస్టులు దళితులకు విశ్వసనీయమిత్రులు వారితో కలిసి కొనసాగాలని' చెప్పిన విషయాన్ని ఈ సందర్భంలో గుర్తు చేస్తున్నాను.

నవల నడక

ఈ నవల 110 పుటల పుస్తకం. ముందు మాటలు 10 పుటలు పోను నవల అంతా వంద పుటల్లో 18 అధ్యాయాలుగా విభజితమైంది. నవలా నాయకుడు అమరయ్య, ఉపనాయకులు అమరయ్య సంతానమైన సుందర రావు, ఆనందరావు, సుశీల- ప్రతినాయకుడు భూపతిరావు. నవలా కేంద్రం: ధనదవోలు గ్రామానికి దగ్గరలోని మండేవారి మాలపల్లె. ఇది మాల కులానికి చెందిన నాసరయ్య రాసిన నవల.

నవల కొనసాగింపు

ధనదవోలుగ్రామంలో శ్రీరాముని గుడివద్ద శ్రీరామనవమి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రవచనాన్ని ఆగి వింటున్న అమరయ్యను 'ఓరేయి అమిరిగా లేవరా అక్కణ్ణుంచి...మాల వెధవ!' అని భుజంగరావు గుమాస్తా తిడతాడు. దీనితో కలత చెందిన అమరయ్య పల్లె ప్రజలకు విషయాన్ని వివరిస్తాడు. పల్లెలోనే రామాలయాన్ని కట్టాలని అందరూ నిర్ణయించుకుని నిర్మిస్తారు. శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. దీనితో పల్లెపై పెత్తనం పోతుందని భావించిన భూపతిరావు చినజియ్యరుస్వామిని తీసుకొనివచ్చి పల్లెలో రామాలయం ఉండగూడదని చెప్పిస్తాడు. "మీరు అంటరానివాళ్లగా దరిద్రులుగా పుట్టటానికి గత జన్మలో మీరు చేసుకున్న పాపపుణ్యాలే కారణం. ఈ జన్మలో పుణ్యాలు చేసుకోండి. మరుజన్మలో మీకు మంచి గతులబ్బుతాయి. మీ పల్లెలో రామాలయం నిర్మించి రాముణ్ణి బంధించారు. దేశంలో ఎక్కడ ఏ మాలపల్లెలో దేవుడికి ఆలయాలులేవు. మీ పల్లెలోఆలయం అరిష్టదాయకం. వెంటనే ఆ ఆలయాన్ని మూసెయ్యండి అని చినజియ్యరుస్వామి చెప్పిన మాటలు ఆ చినజియ్యరు స్వామిని ఎంతగానో అభిమానించే అమరయ్యకు రుచించలేదు. అవి అబద్ధపుమాటలని తేల్చుకుంటాడు. దేవుడు మీద విశ్వాసాన్ని కోల్పోతాడు.

అమరయ్యలో అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. అసలు అంటరానివాళ్లం ఎందుకయ్యాం. హిందూమతంలోని అనేక అసంగత విషయాలపై తనలో తనే తర్కించుకుంటాడు. చర్చించుకుంటాడు. ఇంతలో క్రైస్తవ ఫాదర్ అమరయ్యకు చేరువవుతాడు. అమరయ్య క్రైస్తవమతంలో చేరి యేసోబుగా మతాంతీకరణ చెందుతాడు. పల్లెలో పాఠశాల ఏర్పాటవుతుంది. దానిని రామాలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తారు. ఈ మతాంతీకరణకు ముందే గ్రామంలో పల్లెవాసులు కూలీలుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి. కూలికి గింజలు బదులు రొక్కం యివ్వాలని పల్లె జనులచేత సమ్మెకట్టించి అమరయ్య విజయంసాధించాడు. పల్లె శ్రామికులకు అమరయ్య మీద విశ్వాసం, గౌరవం పెరుగుతాయి.

పల్లెపైన పట్టు కోల్పోయిన భూపతిరావు అమరయ్యను యిబ్బందులకు గురి చేయాలని నిర్ణయించుకుంటారు. అమరయ్య కౌలుకు చేసుకుంటున్న పదెకరాలలో ఐదెకరాలు ఆ వూరికి చెందిన శాస్త్రిది. పట్టణంలో ఉంటున్న శాస్త్రివద్దకు వెళ్లి ఆ భూమిని అమరయ్య కౌలునుండి తొలగించమని కోరినా శాస్త్రి తిరస్కరిస్తాడు. శాస్త్రికి భూపతిరావు అతని కులంపైన కోపం ఉంది. వారి వల్లనే తాను ఆ వూరు వదలి రావలసి వచ్చిందనే బాధ కూడా ఉంది. బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాన్నే అందుకు కారణంగా భావిస్తాడు. భూమి అమరయ్య కౌలులోనే ఉంటే క్షేమమని భావిస్తాడు శాస్త్రి. గ్రామంలోని హోటళ్లలో అమలవు తున్న రెండు గ్లాసుల విధానాన్ని నిరసిస్తూ మాలవాళ్లు ఆ హోటళ్లకు వెళ్లకుండా పల్లెలోనే హోటల్‌సౌకర్యాన్ని కల్పించుకున్నారు. అమరయ్య కొడుకు సుందరరావు పదో తరగతి చదువుకున్నాడు. అతనిలో సామాజిక చైతన్యం, కుల చైతన్యం ఉన్నాయి. అతనిపై భూపతిరావు దొంగతనం మోపి కొట్టిస్తాడు. పల్లెవారు భూపతిపై తిరగబడతారు. పల్లెలో ఐక్యత పెరిగింది. పల్లెవారు మంచి బట్టలు వేసుకునేట్లు చేస్తాడు సుందర రావు. అమరయ్య కూతురు సుశీల పొలానికి వెళ్లినప్పుడు అత్యాచారానికి, హత్యకు గురవుతుంది. ఆ దుండగుడిని పట్టుకుని శాశ్వత వికలాంగుడిని చేస్తారు ఆనందరావు, పల్లెలోని యువకులు.

అమరయ్య కొడుకు ఆనందరావు డాక్టర్ చదివి పక్క పట్టణంలో ఆస్పత్రి నిర్మించి దళిత వర్గాలకు అంబేద్కర్ ఆరోగ్య కేంద్రం పేరుతో వైద్యసేవలు అందిస్తున్నారు. మంచిపేరు తెచ్చుకున్నాడు. మండల కమీషన్ ఏర్పాటయిన సందర్భంలో ఆ ఆస్పత్రిపై దాడి జరుగుతుంది. విధ్వంసం జరుగుతుంది. ఆ దాడిలో ఆనందరావు తీవ్రంగా గాయపడతాడు. కాలక్రమంలో భూపతిరావు శాసనసభ్యుడవుతాడు. మండేవారి మాలపల్లె లోనే ఒక పక్కనున్న మాదిగపల్లెను తరలించాలని ప్రయత్నిస్తాడు. అక్కడ ఉన్న భూమిని తాను వశపరుచుకుని ఎరువుల ఫ్యాక్టరీని నిర్మిస్తాడు భూపతిరావు. కార్మిక సంఘం ఏర్పాటై హక్కుల కోసం పోరాడుతుంది. ఫ్యాక్టరీలో పనిచేసే యిద్దరు మహిళలను మానభంగం చేసి హత్య చేశారు. కార్మిక సంఘం ఒత్తిడితో కేసు నమోదవుతుంది. సుందరరావు తన సమీప గ్రామానికి చెందిన బి.ఏ చదివిన సువార్తను ఆదర్శవివాహం చేసుకుంటాడు. అంతకుముందు జరిగే వివాహాల మాదిరికాకుండా సాంఘిక వివాహం. దండలమార్పిడి ద్వారా జరుగుతుంది. ఆదర్శభావాలు కలిగిన సువార్త పల్లెకుచెందిన మహిళలను సమావేశపరచి రాత్రి పాఠశాలలు ఏర్పాటుచేసి వారిని చైతన్యపరుస్తుంది. భర్తల తాగుబోతుతనాన్ని ఎలా అరికట్టాలో, పొదుపు ఎలా చేయాలో తెలుపుతుంది. ప్రభుత్వం అందించే ఆర్థిక పథకాలను వారికి చేరువ చేస్తుంది. శ్రమ విలువ గురించి వారికి చక్కగా తెలియజేస్తోంది.

అమరయ్య చిన్న కూతురు సుశీల. కళాశాలలో చదివేటప్పుడే విద్యార్థి ఉద్యమాలలో చురుకైన కార్యకర్త. మంచి వక్త. అభ్యుదయ, హేతువాద భావాలు కలిగిన తన సహ విద్యార్థిని ఆదర్శ వివాహం చేసుకుంటుంది. సుందరరావు దళిత మహాసభ నాయకుడిగా ఎదుగుతున్నాడు. దళితుల ఐక్యత కొరకు ఊరూరా తిరిగి కృషి చేస్తున్నాడు. అమరయ్య పల్లె మొత్తానికి నాయకుడయ్యాడు. పల్లెకు కావలసిన శ్మశానాన్ని సాధిస్తాడు. పల్లె ప్రజల ప్రయోజనాలను పరిరక్షిస్తాడు. అమరయ్యకు కుల, మత విషయాలపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది. దళిత వర్గాల ఐక్యత మాత్రమే దళిత వర్గాల ప్రగతికి తోడ్పడగలదనే స్పష్టమైన ఆలోచనకు వచ్చాడు. అమరయ్య ఆలోచనలతో దళితుల పొలాల వద్ద చెరువు ఏర్పడుతుంది. పంటలు బాగా ఎండుతాయి. భూపతిరావు పల్లె ప్రజల భూమిని దక్కించుకోవాలని పోలీసుల సహాయంతో, అధికార బలంతో ప్రయత్నిస్తాడు. కాల్పులు జరుగుతాయి. ఆ కాల్పుల్లో అమరయ్యతో పాటు మరో ఇద్దరు మృతి చెందుతారు. కొందరు గాయాలపాలయ్యారు. అమరజీవి అమరయ్యకు పల్లెవాసులు ఘనంగా వీడ్కోలు చెప్పి స్మారక స్థూపం నిర్మాణం చేస్తారు.

అమరయ్య అందించిన 'దున్నేవాడిదే భూమి' సందేశంతో ఇకపై భూస్వాములు, పెట్టుబడిదారులు కాకుండా తామే అధికారంలోకి రావాలనే ఆలోచనకు పల్లె ప్రజలు వచ్చారు. 'ఓట్లన్నీ మనవే- మన ఓట్లన్నీ మన వాడికే' అని నిర్ణయించుకున్నారు. సుందరరావు ఈ ఆలోచనకు సూత్రధారి. జనాభా లెక్కలు ప్రభుత్వం తీయించాలి. కుల గణన జరగాలి. ఏ కులం ఎంత శాతం ఉందో ఆ మేరకు వారికి అధికారం కలగాలి. దామాషా పద్ధతి సరైనది- అది అవసరమైనది అని సుందరరావు చెప్పిన మాటలు సరైనవేనని అందరూ అన్నారు. (కేంద్ర ప్రభుత్వాన్ని కులగణన చేయాలని అనేక రాజకీయ పక్షాలు నేడు పట్టుబట్టటాన్ని గమనించాలి). ఆ గ్రామంలో కులాల వారీగా ఎవరికి ఏ పదవి ఉండాలో అని నిర్ణయం జరిగింది కుల జనాభాను బట్టి. అగ్నికుల క్షత్రియుల జనాభా ఎక్కువ కాబట్టి వారికి ప్రెసిడెంట్ పదవి యివ్వాలన్నారు. అయితే వారు సుందరరావును ప్రెసిడెంట్ పదవికి ప్రతిపాదిస్తారు. ఎన్నికలు జరిగాయి. భూపతిరావు వర్గం చిత్తుగా ఓడిపోయింది. సుందరరావు వర్గం గ్రామాధిపత్యం సాధించింది.

ఈ నవలలో ఎస్.సి రిజర్వేషనుల వలన మాదిగలు నష్టపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. అందుకే దామాషాపద్ధతి కావాలనే ప్రతిపాదన వ్యక్తమయింది. వర్గీకరణకు మాల కులానికి చెందిన సుందరరావు అంగీకారం తెలపటం ద్వారా ఆ కులం కూడ వర్గీకరణకు అనుకూలమే అనే భావన కలిగించారు. అంబేద్కర్, మార్క్స్ భావజాలాలను సుందరరావు పల్లె ప్రజలకు వివరిస్తాడు. మాల మాదిగల ఐక్యతను బలంగా ప్రతిపాదించాడు సుందరరావు. "మాలపల్లెకు మాదిగపల్లె నాయకత్వం వహించే రోజు సమీపంలోనే ఉందని కొందరు యువకుల మనసుల్లో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది". అని రచయిత పెరుగు నాసరయ్య 'ముగింపు కాదు అధ్యాయం' తో ఈ నవల సందేశాత్మకంగా ముగుస్తుంది.

(అరసం ఆధ్వర్యాన గౌరవాధ్యక్షురాలు డా॥పి.సంజీవమ్మ అధ్యక్షతన 1-5-2022 న జరిగిన 83 వ జూమ్ సమావేశంలో చేసిన ప్రసంగానికి అక్షరరూపం.)

సాహితి

జాతర

డా. ఎన్. గోపి

ఈ మధ్య జీవితం
రెండోసారి జీవిస్తున్నట్టుగా వుంది
పునరావృతం కాదు
కొత్తగా కూడ వుంది.

రోజులు వచ్చాయీ వెళ్లాయి
అనుభవాలను
ఒంట పట్టించుకుని మరీ వెళ్లాయి
నడిచి వచ్చిన దారులు కూడా
ఎప్పటిలాగే వున్నాయి
లేవు కూడ.

గడిచిపోయిందేదీ
గతించలేదు
దాచుకున్నదేదీ
వొడిసి పోలేదు.
జాతర పాతదే కావచ్చు
మనుష్యులు కొత్తవాళ్లు
ప్రవాహం సాగుతూనే వుంది.

పక్షిలా వచ్చి వాలింది
న్యూస్ పేపర్
నా చూపుల్ని బుక్కుతూ
తాజా తాజాగా
మజా మజాగా
ఆలోచనలు పదునెక్కుతున్నాయి.

నిర్వచనాలను మానేశాను
మూల్యాంకనం శుద్ధ వేస్ట్!
జీవితాన్ని
జీవించడమే మంచిది
అది యాంత్రికత కాదు
అలజడుల మాంత్రికత.

దుఃఖం నీ ఒక్కడిది కాదు...

పచ్చని
నీ పనితనం మీద
బాస చేసి చెబుతున్నా
స్వేదంతో చెలిమి చేసే
నీ శ్రమైక శ్వాస మీద
వాలిపోయి చెబుతున్నా
భుజాన నాగలితో
భూమిని ముద్దాడే
నీ బరువైన పాదాలపై రాలే
వాన చినుకునై చెబుతున్నా...

మోట బావికాడ నీ పొలంలో
విత్తుల్ని నాటి మట్టిముద్దై
గట్టున కూలపడ్డ దేహంపై
టప టపా రాలుతున్న
చెమట చుక్కనై చెబుతున్నా...

ఆకలేసే గుండెను ఎండగట్టి
పొలం నీళ్లకు పారగట్టి...గోర్రుకట్టి
పొలాన్ని దమ్ము చేసి
కలుపు మొక్కల్ని ఏరి
కుప్పలు పోసిన ధాన్యాన్ని
బంతికొట్టి, తూర్పారబట్టి
పొద్దు గుంకిన ఏల
పొలం గట్టెంట నువ్వొస్తాంటే...
పురుగు పుట్రా కుట్టి
బురదలోనే వొరిగిన నీ కోసం
కళ్లల్లో వొత్తులేసుకుని చూస్తున్న
నీ వోళ్ళ ఊపిరినై చెబుతున్నా...

సూరీడు సురుక్కు సురుక్కున
పొడుస్తున్నా..
కాడెద్లతో కొలువు తీరి
దుక్కి దున్నిన రారాజు భుజంపై
తడిసి ముద్దయిన
ఎర్ర రంగు కండువాన్నై చెబుతున్నా...

గంజితాగో... గటక తినో...
అన్నం మెతుకు కోసం ఆరాటపడి
వరి గొలుసుల్ని చూసి ముచ్చటపడ్డ
నీ గుండె చప్పుడునై చెబుతున్నా...
దుఃఖం నీ వొక్కడిది కాదు
నువ్వు పండించిన
అన్నం మెతుకులు తిన్న అందరిదీ...!

డా.కటుకోర్ఘ్వుల రమేష్
సెల్: 9949083327

కొత్తతరం తెలుగు ప్రజలకు, పాత్రికేయులకు మంచిదారి 'మూడుదారులు'

గ్రంథ సమీక్ష

నాంచారయ్య మెరుగుమాల

దాదాపు 75 సంవత్సరాల తెలుగు నేల రాజకీయ చరిత్రను పూసగుచ్చినట్టు వివరించే విలువైన పుస్తకం 'మూడు దారులు'. జగమెరిగిన జర్నలిస్టు సంఘాల నేత, ప్రముఖ పాత్రికేయుడు దేవులపల్లి అమర్ రాసిన ఈ గ్రంథంలో తెలుగునాట రాజకీయాలకు, ఎన్నికలతో ముడిపడిన కొన్ని ఉద్యమాలకు సంబంధించిన సమాచారం నిండుగా ఉంది. ముఖపత్ర చిత్రంపై కనిపించే ముగ్గురు నాయకుల వ్యవహార సరళిపై రచయిత ఈ పుస్తకంలో వెంటవెంటనే వెలిబుచ్చిన అభిప్రాయాలతో పాఠకులు ఏకీభవించకపోవచ్చు. అయితే, స్వాతంత్ర్యం వచ్చాక హైదరాబాద్ స్టేట్‌లో, మద్రాసు, ఆంధ్ర రాష్ట్రంలో పరిణామాలు, ఆంధ్రప్రదేశ్ అధికార రాజకీయాల సమాచారం అక్కడక్కడా ముందూ వెనకగా కాస్త గజిబిజిగా కనిపించినా నేటి తరం పాత్రికేయులకు తమకు తెలియని అనేక పరిణామాలను ఇది పరిచయం చేస్తుంది. వాటిపై భిన్న కోణాలను చూపిస్తుంది. ఆధునిక తెలుగు రాజకీయ చరిత్రగా పరిగణించే ఈ పుస్తకంలోని ప్రధాన 'హీరోలు' నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలతో రచయితకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. కడప జిల్లా రాజకీయ పునాదిగా ముఖ్యమంత్రులుగా ఎదిగిన డాక్టర్ వైఎస్, ఆయన కుమారుడు వైఎస్ జగన్‌తో రచయితకు చంద్రబాబుతో పోల్చినప్పుడు సంబంధబాంధవ్యాలు కొద్దిగా ఎక్కువ. అయితే, ఈ ముగ్గురు నేతల పాలనాకాలంలో అమర్ ప్రభుత్వ పదవుల్లో (ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్, 2019 నుంచీ ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా, అంతరరాష్ట్ర వ్యవహారాల సలహాదారు) కొనసాగారు. వారు ముగ్గురినీ చాలా దగ్గరగా చూశారు. డాక్టర్ వైఎస్, జగన్ పై దేవులపల్లి అమర్‌కు అభిమానం కొద్దిగా ఎక్కువ అనే అభిప్రాయం కూడా పుస్తకం చదివి పక్కనపెట్టాక మనకు కలుగుతుంది.

రెండు ఆగస్టు 'వెన్నుపోటు' ఘటనలపై చెప్పిన విషయాల్లో కొత్తవేవీ లేవుగాని... తెలుగుదేశం స్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు సీఎం పదవిలో ఉండగా తొలుత 1984లో, మళ్లీ పదేళ్ల తర్వాత 1995లో ఆగస్టు సంక్షోభాల పేరుతో సంభవించిన పరిణామాలపై రచయిత పూసగుచ్చినట్టు రాసిన వివరాలు, వ్యాఖ్యలు చాలా వరకు తెలిసినవే. హైదరాబాద్ కేంద్రంగా దశాబ్దాలుపాటు పనిచేసిన అమర్‌కు ముగ్గురు పెద్ద నేతలతో సుహృద్భావ సంబంధాలున్నప్పటికి ఈ సంక్షోభాల సమయంలో తెరవెనుక జరిగిన, చాలా మందికి తెలియని రాజకీయ లోగుట్లు 'మూడు దారులు'ల్లో వెల్లడవుతాయని భావించిన పలువురు తెలుగు జర్నలిస్టులకు కొంతవరకు ఆశాభంగమే ఎదురైంది. ఎన్టీఆర్ మూడో అల్లుడు, కాంగ్రెస్ పార్టీలో మూలాలు కలిగి ఉండడంతోపాటు కాంగ్రెస్ సంస్కృతిని నరనరాన జీర్ణించుకున్న 'హైటెక్' మాజీ సీఎం చంద్రబాబులోని చీకటి కోణాలను. పదవీకాంక్షను. తన వర్గానికి, భజనపరులకు లోపాయికారిగా మేలు చేసే స్వభావాన్ని నిర్మొహమాటంగా ఇలా పుస్తక రూపంలో ఎవరైనా ఎండగట్టవచ్చు. అందులో తప్పేమీ లేదు. అయితే, ఇప్పటికే ఎందరో జర్నలిస్టులు, రాజకీయ పండితులు ఆ పని చేసేశారు. మరి పాత వివరాలతో, పదే పదే విన్న పాత వ్యాఖ్యలతో కాకలుతీరిన జర్నలిస్టు అమర్ ఇప్పుడు 'మూడు దారులు' పేరుతో ఈ పుస్తకం రాయడం సాధారణ ప్రజానీకానికి పెద్దగా ప్రయోజనం లేని కసరత్తు.

రాష్ట్ర రాజకీయాలను దురదృష్టకరమైన మలుపు తిప్పిన 1955 ఆంధ్ర రాష్ట్ర శాసనసభ మధ్యంతర ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ ఓటమికి కారణాలు విశ్లేషణాత్మకంగా, క్లుప్తంగానైనా వివరించగల గొప్ప రాజకీయ, పాత్రికేయ నేపథ్యం ఉన్న అమర్ ఆ పని చేయలేదు. అంతేకాదు, ఆ ఎన్నికల్లో కమ్మలు అంతా కమ్యూనిస్టులకు ఓటేసినట్టు, మెజారిటీ రెడ్లు కాంగ్రెస్ గెలుపులో ప్రధాన భూమిక పోషించినట్టు ఆయన రాశారు. వాస్తవానికి కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు కోస్తా జిల్లాల్లో పలుకుబడి కలిగిన అనేక మంది కమ్మ నేతలను తనవైపునకు తిప్పుకుంది. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్లు ఇచ్చింది. ఈ పెత్తందారీ కమ్మ నాయకులు కమ్యూనిస్టుల పరాజయంలో అత్యంత కీలక పాత్ర పోషించారు. అప్పట్లో ఆంధ్రా స్టేట్ రాజకీయాలను రెడ్ల



ఆధిపత్యంలోని కాంగ్రెస్, కమ్మ ప్రాబల్యంలోని సీపీఐ మధ్య రాజ్యాధికారం కోసం జరిగిన ఎన్నికల పోరాటం అనే తీరులో (1955 ఎన్నికలను కూడా) వర్ణించడం మేధోపరమైన బద్ధకమే అనిపిస్తుంది. మూడేళ్లు మాత్రమే ఉనికిలో ఉన్న ఆంధ్రరాష్ట్ర ఎన్నికల్లో 29 శాతం ఓట్లు వచ్చినా కేవలం 15 సీట్లు తెచ్చుకుని ఘోర పరాజయం పాలైన కమ్యూనిస్టు పార్టీ అప్పట్లో ఘోర తప్పిదం చేసింది. సీపీఐ నాయకత్వం అనేకమంది తమ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులను 'ఇక మనకు అధికారం రాదు. ఇప్పటికే పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేశారు. మీ కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతిన్నాయి. ఇక మీరు మీకు అనువైన వేరే దారి చూసుకోండి. సానుభూతిపరులుగా కొనసాగండి,' అనే లోపాయికారి సందేశంతో తెలుగునాట అస్త్ర సన్యాసం చేసింది. హైదరాబాద్ కేంద్రంగా నడిచిన విప్లవ కమ్యూనిస్టు రాజకీయాలతో, వామపక్ష మేధావులు, పౌరహక్కుల సంఘాలు, సంస్థలతో గతంలో, ఇప్పుడు సజీవ సంబంధాలున్న దేవులపల్లి అమర్ ఇలాంటిలోతైన, నేటితరం యువత తెలుసుకోవాల్సిన విషయాల జోలికి పోకుండా ముగ్గురు రాష్ట్ర నాయకులు, వారి చుట్టూ తిరిగిన రాజకీయాలకు, వారి పాలనావిషయాలకు ఈ పుస్తకంలో పరిమితం కావడం నిజంగా విషాదం. మా తరం జర్నలిస్టులకు స్ఫూర్తినిచ్చిన సమరశీల జర్నలిస్టు అమర్ ఏడున్నర దశాబ్దాల తెలుగు రాజకీయాలపై ఒక సగటు పాత్రికేయుడు లేదా రాజనీతి శాస్త్ర అధ్యాపకుడి మాదిరిగా ఈ పుస్తకంరాసి జనంమీదకు వదలారా? అనే అనుమానం చాలా మందిని పీడిస్తోంది. పీవీ నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి, ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, రాజశేఖరరెడ్డి రాజకీయ శైలి, వ్యక్తిత్వం, ఇతరులతో వ్యవహరించే తీరు, ప్రజా సంక్షేమంవిషయంలో వారి అంకితభావం గురించి రచయిత చక్కగా విశ్లేషించారు. అయితే, వైఎస్ జగన్ పాలనా విధానాలు, సంక్షేమ రాజ్య స్థాపనలో ఆయనకున్న కారణాల గురించి, జగన్ రాజకీయ పునాది గురించి నామమాత్రంగానైనా ప్రస్తావించకపోవడం కొట్టొచ్చినట్టు కనిపించే పెద్ద లోటు. పీవీ గురించి ప్రశంసాపూర్వకంగా రాసిన వాక్యాలు కొన్ని ఉన్నాయి. అయితే, తెలంగాణ కాంగ్రెస్ చట్టసభల సభ్యుల్లో కనీసస్థాయి మద్దతుగాని, జనంతో మంచిసంబంధాలు గాని లేని అపర చాణుక్యుడు పాములపర్తి వారికి 1970ల్లో ఉన్న బలహీనతలు, లోపాల గురించి కొద్దిగా కూడా రచయిత ఇందులో చెప్పక పోవడం దారుణం. నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఏపీ కాంగ్రెస్ శాసనసభా పక్షంతో విస్తృతంగా సంప్రదించకుండా, ఏకపక్షంగా నరసింహారావును ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్‌పై రుద్దడం వల్లే అనేక దుష్పరిణామాలు తెలుగు రాజకీయాల్లో సంభవించాయని పాత తరం రాజకీయ పరిశీలకులకు తెలుసు. 1971 చివర్లో కాసు బ్రహ్మానందరెడ్డి ఖాళీచేసిపోయిన కుర్చీ ఎక్కిన పీవీ రాజధాని ఢిల్లీపోయి వారం పదిరోజులు కూర్చున్నా కాంగ్రెస్ ప్రధాని అపాయింట్‌మెంట్ దొరకకపోవడం అప్పట్లో జగమెరిగిన సత్యం. అలాగే, ఏపీ అవతరణ నాటి నుంచి 1982లో తెలుగుదేశం స్థాపన తర్వాత కొన్ని నెలల వరకూ పాలకపక్షంగా ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో, మంత్రివర్గంలో బలమైన రెడ్డి, కమ్మ వర్గాల మధ్య సమతూకం పాటించడానికి కాంగ్రెస్ హైకమాండ్ లేదా కేంద్ర నాయకత్వం అత్యంత శ్రద్ధతో ప్రయత్నించింది. చాలా వరకు ఈ విషయంలో సఫలమైంది. ఏపీలో కమ్మ కాంగ్రెస్ నేత ఎవరికీ సీఎం పదవి ఇవ్వలేదు గాని కొత్త రఘురామయ్య వంటి సమర్థ కమ్మనేతను కేంద్ర మంత్రివర్గం లోకి తీసుకుని కీలక శాఖలు అప్పగించారు ఇందిరమ్మ. 1978-83 మధ్య ఏపీ కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏవిధంగా రెడ్ల అంతర్గత కీచులాటలకు అడ్డాగా మారి పోయాయో, అధికార కాంగ్రెస్ రెడ్ల నాయకత్వంపై తెలుగు ప్రజల్లో ఎలాంటి ఏవగింపు కలిగిందో కూడా పుస్తక రచయిత కనీసం ప్రస్తావించలేదు.

అసలు ఏపీ రాజకీయాలను శాసించిన లేదా వాటిలో ప్రధాన భూమిక పోషించిన కాంగ్రెస్ కమ్మ, రెడ్డి ఫ్యాక్షన్ల గురించి పేరు పెట్టి వ్యాఖ్యానించకపోవడం మార్క్సిస్టు అవగాహన, విశ్లేషణా సామర్థ్యం ఉన్న అమర్ పుస్తకంలో చాలా పెద్ద లోపంగా కనిపిస్తోంది. అలాగే, మొదట అన్ని కులాలకూ కాకపోయినా రెడ్డి, కమ్మ, కాపు సామాజిక వర్గాల్లో అసంతృప్తి లేకుండా దశాబ్దాలపాటు జాగ్రత్తపడ్డాయి. కేంద్ర, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాలు. కాని, 1983 జనవరి నుంచి ఏడేళ్ల ఎన్టీఆర్ పాలన తర్వాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో, పార్టీ పదవుల్లో రెడ్లకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం, 1995-2004 మధ్య నారా చంద్రబాబునాయుడు పాలన, 2004-2009 మధ్య డాక్టర్ వైఎస్ హయాం తర్వాత ఏపీ రాజకీయాలు అధికారం కోసం, వనరులపై పెత్తనం కోసం ఒక జాతీయపక్షం (కాంగ్రెస్), ఓ ప్రాంతీయపక్షం(టీడీపీ) మధ్య తీవ్ర పోరాటానికి, పోటీకి వేదికగా మారిపోయాయి. చివరికి ఇవి పెత్తందారీ రెడ్లు, కమ్మల మధ్య ఆధిపత్య పోరులాగా ఇతర రాష్ట్రాల వారికి సైతం కనిపించాయి. అమర్ వంటి ఆధునిక భావాలున్న బుద్ధిజీవి ఇలాంటి విషయాలను కూడా ఈ పుస్తకంలో లోతుగా విశ్లేషించి ఉంటే బాగుండేది. ఏదేమైనా తెలుగునాట రాజకీయాల గురించి సమగ్ర సమాచారం మాత్రం దేవులపల్లి అమర్ రాసిన ఈ గ్రంథంలో పుష్కలంగా దొరుకుతుంది. కొత్త తరానికి చీకటిలో కరదీపికగా ఉపకరిస్తుంది.

ఇండియా కూటమికి ధోకా లేదు

- 272కుపైగా స్థానాల్లో గెలుపు
- బీజేపీ ఓటమి తథ్యం
- విపక్షాల అవినీతిపై ప్రధానివి డొల్ల ప్రకటనలు: జైరాం రమేశ్

న్యూఢిల్లీ: ఇండియా కూటమికి ధోకా లేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఉద్ఘాటించారు. 272కుపైగా స్థానాల్లో గెలుస్తామని దీమా వ్యక్తం చేశారు. బీజేపీని గద్దె దించడం ఖాయమన్నారు. బీహార్ సీఎం నితీశ్ కుమార్ పిల్లిమొగ్గలు వేసినాగానీ టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ పట్టుదలగా ఉన్నాగానీ ఇండియా కూటమి పటిష్ఠంగా ఉందని చెప్పారు. ప్రతిపక్షాల అవినీతి మీద ప్రధాని మోదీ చేసేవన్నీ డొల్ల ప్రకటనలని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల బాండ్లు, దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ అరెస్టుతో పాటు కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా పోటీ చేసే స్థానాలు వంటి అనేక అంశాలపై జైరాం రమేశ్ ఆదివారం పీటీఐతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో అమేథి, రాయ్ బరేలి నుంచి రాహుల్, ప్రియాంక పోటీ చేస్తారని చెప్పారు. హేమంత్ సోరెన్, అరవింద్ కేజ్రీవాల్‌ను ఉదాహరణగా చూపి అవినీతిపై పోరాడుతున్నట్లుగా మోదీ చేసేవన్నీ డొల్ల ప్రకటనలని, వాటికి వాస్తవాలకు పొంతన లేదని అన్నారు. ఎన్నికల బాండ్ల వ్యవహారం మొత్తం క్విడ్ ప్రో కో అని వ్యాఖ్యానించారు. నితీశ్ లేనంత మాత్రానా ఇండియా కూటమి కుప్పకూలదని నొక్కిచెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తు పటిష్ఠంగా ఉందని, ఎన్‌సీపీ, శివసేన, డీఎంకే, జేఎంఎంతో ఏకాభిప్రాయం కుదిరిందని, పశ్చిమ బెంగాల్‌లో సీపీఐ, సీపీఎంతో కలిసి ఉన్నామని, అసోంలో 11 పార్టీలతో సంకీర్ణం ఏర్పాటైందని, సమాజ్ వాదీ పార్టీలతోనూ సంకీర్ణమున్నదని జైరాం రమేశ్ చెప్పారు. తమతో సీట్లను ఆమె పంచుకోకపోయినాగానీ ఇండియా కూటమిలో భాగంగా మమతా బెనర్జీ ఉన్నారని చెప్పారు. ఎన్నికల బాండ్ల వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత ప్రధాని క్విడ్ ప్రో కో... 'చందా దో, ధందా లో' (చందా ఇవ్వు, వ్యాపారం పొందు) పంథా బహిర్గతమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల బాండ్ల రూపేణ కొన్ని కోట్లు సమకూరాయన్న ప్రశ్నకు 'మా వద్ద కేంద్ర దర్యాప్తు సంస్థలు లేవు. మేము ఏ



కంపెనీకి కేంద్ర కాంట్రాక్టులు ఇవ్వలేము' అని అన్నారు. రాహుల్, ప్రియాంక యూపీలోని తమ కుటుంబానికి కంచుకోటలుగా ఉన్న స్థానాలను విడనాడినట్లు వచ్చిన వదంతులను తోసిపుచ్చారు. అమేథి, రాయ్‌బరేలి నుంచి వారు పోటీ చేస్తారని తెలిపారు. 'తాను పార్టీకి నిబద్ధగల సైనికుడినని, సీఈసీ ఏం చెబితే అదే చేస్తానని రాహుల్ ఇప్పటికే చెప్పారు' అని జైరాం రమేశ్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ సీనియర్ నేతలలో ఎవరూ విముఖంగా లేరని స్పష్టంచేశారు. ఎవరూ పోటీ నుంచి తప్పించుకోవడంలేదు....పోటీ చేయమని ఒక్కరూ చెప్పలేదు అని అన్నారు. రాహుల్ నాయకత్వ పరిధిని దాటి కాంగ్రెస్ ఆలోచిస్తుందా అన్న ప్రశ్న 'వారసుడు ఉన్నారు... భారత్ జోడో యాత్రలను సమర్థంగా నిర్వహించారు. దేశంలో ఏ నాయకుడు ఇలా చేయలేదు' అని జైరాం రమేశ్ అన్నారు. 'రాహుల్ రాజకీయం కాస్త భిన్నమైనది. ఆయన రాజకీయం... ఉద్యమ రాజకీయం... వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలని, పునరుత్తేజపర్చాలని కోరుకుంటారు.

వ్యవస్థలో కొత్త ఉత్సాహాన్ని నింపడంలో అసాధరణ విజయాన్ని సాధించారు. భారత్ జోడో యాత్రల తర్వాత ఆయన గురించి చాలా మంది అభిప్రాయం మారింది. పాత్రికేయుల ఆలోచనలోనూ మార్పు వచ్చింది' అని తెలిపారు. ఒక్క మమతా బెనర్జీ తప్ప ప్రతి రాష్ట్రంలోని విపక్ష నాయకులు భారత్ జోడో యాత్రల్లో పాల్గొన్నారని, కలిసికట్టుగానే ముందుకెళు తున్నట్లు జైరాం రమేశ్ తెలిపారు.

మోదీని ఇకపై... 28 పైసల ప్రధాని అని పిలుద్దాం

తమిళ మంత్రి ఉదయనిధి స్టాలిన్

చెన్నై: ప్రధాని మోదీపై తమిళనాడు మంత్రి, డీఎంకే నాయకుడు ఉదయనిధి స్టాలిన్ విరుచుకుపడ్డారు. అభివృద్ధి విషయంలో రాష్ట్రంపై అయన నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని విమర్శించారు. ఇకపై మోదీని 28 పైసల ప్రధాని అని పిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎందుకంటే పన్ను రూపంలో రాష్ట్రం చెల్లించే ప్రతి రూపాయిలో కేంద్రం 28 పైసలు మాత్రమే తిరిగి మనకు వస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకే అత్యధిక నిధులు కేటాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే మనం మోదీని 28 పైసల ప్రధాని అని పిలుద్దామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రామనాథపురం, థేనిలో ఉదయనిధి ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళనాడు చిన్నారుల భవిష్యత్తును దెబ్బతీయడానికే కేంద్రం జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. అదేవిధంగా నిధుల పంపిణీ, అభివృద్ధి కార్యక్రమాలు, నీట్ నిషేధం వంటి అంశాల్లో తమిళనాడుపై కేంద్రం వివక్ష చూపిందని విమర్శించారు. మధురైలో నిర్మిస్తున్న ఎయిమ్స్ హాస్పిటల్‌కు సంబంధించి శంకుస్థాపనకు ఉపయోగించిన ఇటుకను ప్రదర్శించారు. నీట్ నిర్మాణం ముందుకు సాగడం లేదనడానికి ఇదే నిదర్శమన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలోనే ప్రధాని తమిళనాడు పర్యటనకు వస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 39 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19న ఒకే విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. జూన్ నాలుగున ఫలితాలు వెలువడతాయి.

షార్ట్ సర్క్యూట్‌తో పేలిన ఫోన్

నలుగురి చిన్నారులు మృతి

మీరట్: ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మోదిపురం జనతా కాలనీలో ఓ ఇంటిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మొబైల్ ఫోన్ పేలి గదిలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో నలుగురు చిన్నారులు మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం... జనతా కాలనీలో నివాసం ఉంటున్న జానీ(41) కూలీ పనులు చేసుకుంటూ, భార్య బబిత (37), పిల్లలు సారిక (10), నిహారిక (8), గోలు (6), కల్లు (5)లను పోషిస్తున్నాడు. గదిలో పిల్లలు ఆడుకుంటూ శనివారం సాయంత్రం మొబైల్ ఛార్జర్‌ను ఎలక్ట్రికల్ బోర్డులో పెట్టారు. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. మొబైల్ ఫోన్ ఒక్కసారిగా పేలి మంచానికి మంటలు అంటుకున్నాయి. మంటలు చుట్టుముట్టడంలో చిన్నారులు కేకలు వేశారు. వెంటనే జానీ, బబితలు ఆ గదిలోకి వెళ్లి చిన్నారులను మంటల బారి నుంచి కాపాడారు. బబిత, జానీ కూడా గాయపడ్డారు. ఇంట్లో నుంచి అరుపులు వినిపించడంతో ఇరుగుపొరుగు వారు అక్కడికి చేరుకుని పోలీసులకు విషయాన్ని తెలియజేశారు. పోలీసులు బాధితులను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నలుగురు చిన్నారులు మృతి చెందారు. దంపతుల పరిస్థితి విషమంగా ఉంది. బబిత పరిస్థితి మరింత విషమంగా మారడంతో ఆమెను దిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీకి క్రాస్ ఓటు వేసిన ఎస్‌పీ ఎమ్మెల్యేలకు వై కేటగిరీ భద్రత

లక్నో : ఫిబ్రవరి 27న జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి క్రాస్ ఓటు వేసిన నలుగురు సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యేలకు వై కేటగిరీ భద్రతను కేటాయించినట్లు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు ఆదివారం తెలిపారు. వై-కేటగిరీ భద్రత పొందిన నలుగురు ఎమ్మెల్యేలు వరుసగా అభయ్ సింగ్ (గోసాయిగంజ్), మనోజ్ కుమార్ పాండే (ఉంచహార్), రాకేష్ ప్రతాప్ సింగ్ (గౌరీగంజ్), వినోద్ చతుర్వేది (కల్పి) అని ఆయన తెలిపారు. నలుగురు ఎమ్మెల్యేలు పార్టీకి చెందిన మరో ముగ్గురు శాసనసభ్యులు పూజా పాల్, రాకేష్ పాండే, అశుతోష్ మౌర్యతో కలిసి రాజ్యసభ ఎన్నికలలో బీజేపీకి క్రాస్ ఓటు వేశారు. దీంతో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పీ) అభ్యర్థి అలోక్ రంజన్‌పై బీజేపీ అభ్యర్థి సంజయ్ సేథ్ విజయం సాధించారు. అయితే మరో ఎమ్మెల్యే మహారాజీ ప్రజాపతి మాత్రం గైర్హాజరయ్యారు. వై-కేటగిరీ భద్రతలో భాగంగా ఈ ఎమ్మెల్యేలకు ఎనిమిది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది రక్షణగా ఉంటారు. ఐదుగురు సిబ్బంది వారి నివాసాలకు కాపలాగా ఉండగా, మిగిలిన వారు వారితో ప్రయాణిస్తారు. అభయ్ సింగ్‌కు శుక్రవారం భద్రతను కేటాయించగా, మిగతా ముగ్గురికి శనివారం భద్రతను కేటాయించినట్లు అధికారి తెలిపారు.

సీఏఏతో రాజ్యాంగం విచ్ఛిన్నం

పినరయి విజయన్

కాసరగోడ్ (కేరళ): ఎన్నికల ముందు వివాదాస్పద పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ) అమలులోకి తేవడంపై కేంద్రంలోని మోదీ సర్కారును ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా విమర్శించారు. ఈ చట్టం ద్వారా రాజ్యాంగాన్ని చిన్నాభిన్నం చేస్తున్నారన్నారు. సీఏఏకి వ్యతిరేకంగా కాసర్‌గోడ్ జిల్లాలో సీపీఎం నిర్వహించిన భారీ సభలో విజయన్ ప్రసంగిస్తూ... బీజేపీపై విమర్శలు గుప్పించారు. అడాల్ఫ్ హిట్లర్, బెనిటో ముస్సోలినీ ఫాసిజం నుండి స్వీకరించబడిందంటూ దాని మాతృసంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సిద్ధాంతం, నిర్మాణంపై విమర్శలు చేశారు. కేంద్రంలో మోదీ సర్కారును శాసిస్తున్న ఆర్ఎస్ఎస్ లౌకికవాదాన్ని గుర్తించడం లేదన్నారు. 'మన దేశం సెక్యులర్ అయితే ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ సెక్యులరిజాన్ని అంగీకరించలేదు. భారతదేశాన్ని మతతత్వ రాజ్యంగా మార్చాలని, లౌకికవాదాన్ని తొలగించాలని కోరుతోంది. అది మనలో కొందరిని శత్రువులుగా పరిగణిస్తుంది. మతపరమైన మైనారిటీలను, కమ్యూనిస్టులను అంతర్గత శత్రువులుగా ప్రకటించింది' అని విజయన్ అన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త ఎంఎస్ గోల్వాల్కర్ తన పుస్తకంలో క్రైస్తవులు, ముస్లింలు, కమ్యూనిస్టులను దేశ అంతర్గత శత్రువులుగా పేర్కొంటూ చేసిన వ్యాఖ్యల్ని ఆయన ప్రస్తావించారు.

"దాని (ఆర్ఎస్ఎస్) భావజాలం ఏ పురాతన గ్రంథాలు లేదా పురాణాలు లేదా వేదాలు లేదా మనుస్మృతి నుండి రాలేదు. హిట్లర్ నుండి తీసుకోబడింది. మొత్తం మానవాళిని దిగ్భ్రాంతికి గురిచేసిన హిట్లర్ పాలనను అనుసరించిన మారణహోమం మనం చూశాము. అయితే, హిట్లర్ చర్యలను భారతదేశంలోని ఆర్ఎస్ఎస్ ప్రశంసించింది. హిట్లర్ జర్మనీని ఉదాహరణగా తీసుకుని దేశంలోని అంతర్గత సమస్యలను పరిష్కరించుకోవాలని వారు ప్రకటించారు" అని విజయన్ అన్నారు. ఆర్ఎస్ఎస్ నాయకులు ముస్సోలినీని సందర్శించి ఫాసిస్ట్ సంస్థాగత నిర్మాణాన్ని అవలంబించారని కూడా ఆయన చెప్పారు భిన్నత్వంలో ఏకత్వంలోనూ భారతదేశ బలం ఉందని పేర్కొన్నారు. 'మనందరికీ మన విశ్వాసాలు, భాషలు, సంస్కృతులు, ఆహారం , వస్త్రధారణలో తేడా ఉంటుంది. మనం అనేక రంగాలలో విభిన్నంగా ఉన్నాం. అందుకే మనం మన వైవిధ్యాన్ని ఎంతో ప్రేమగా కలిగి ఉన్నాము' అని తెలిపారు. దేశంలోని ముస్లింలను లక్ష్యంగా చేసుకున్న సీఏఏపై కోట్లాది మంది ప్రజలు ఆందోళన చెందుతున్నారని, మన రాజ్యాంగంలో పొందుపరచబడిన సమానత్వ ఆలోచన ఈ చట్టం ద్వారా ముక్కలు చేయబడుతోందని అని ఆయన అన్నారు. దేశంలో సీఏఏ ప్రకటించినప్పుడు ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయని, ప్రపంచ నాయకులు ఈ చర్యను విమర్శించారని విజయన్ తెలిపారు.

సీఏఏకి వ్యతిరేకంగా ఉమ్మడి నిరసన నుండి వెనక్కి తగ్గిన కాంగ్రెస్‌పై కూడా విజయన్ విమర్శలు సీఏఏ అమలుకు సంబంధించిన నిబంధనలను కేంద్రం ఇటీవల నోటిఫై చేసిన తర్వాత కూడా కాంగ్రెస్ పూర్తిగా మౌనంగా ఉందన్నారు. వామపక్షాలు రాష్ట్రంలోని ఐదు చోట్ల భారీ సీఏఏ వ్యతిరేక సభలు నిర్వహిస్తోంది. శుక్రవారం కోజికోడ్‌లో తొలి సభ జరిగింది. రానున్న రోజుల్లో కన్నూర్, మలప్పురం, కొల్లంలో మరో మూడు భారీ సభలు నిర్వహించనున్నారు.

'అంబేద్కర్' నిర్ణయం దురదృష్టకరం

శివసేన యూబీటీ నేత సంజయ్ రౌత్

ముంబై: లోక్‌సభ ఎన్నికలకు ముందు మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన పార్టీతో ఇకపై పొత్తు లేదని వంచిత్ బహుజన్ అఘాడి పార్టీ అధినేత ప్రకాశ్ అంబేద్కర్ ప్రకటించారు. అయితే, ఈ నిర్ణయంపై యూబీటీ శివసేన నేత సంజయ్ రౌత్ స్పందించారు. ప్రకాశ్ అంబేద్కర్ నిర్ణయం ఏకపక్షమని, దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ విషయంలో ఆయన మరోసారి పునరాలోచించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల కోసం ప్రకాశ్ అంబేద్కర్ నేతృత్వంలోని వంచిత్ బహుజన్ అఘాడి పార్టీ మహా వికాస్ అఘాడి శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్‌సీపీ (శరత్ చంద్ర పవార్) పార్టీలతో కలిసి కూటమిలో చేరాలని భావించారు. అయితే, సీట్ల పంపకానికి సంబంధించి ఇప్పటి వరకు నిర్ణయం వెల్లడించలేదు. సీట్ల పంచాయితీ తేలకపోవడంతో ఆయన ఒంటరిగానే బరిలోకి దిగాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ నెల 26న తదుపరి కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. వీబీఏ, మహా కూటమి మధ్య చర్చలపై స్పందించేందుకు నిరాకరించారు. పార్టీల మధ్య అంతర్గత కలహాలు అంతం కావడం లేదని పేర్కొన్నారు.

ఇటీవల ఆయన కూటమిలోని పార్టీల వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మహారాష్ట్రలోని 48 లోక్‌సభ స్థానాల్లో శివసేన (యూబీటీ) 19, కాంగ్రెస్ 16, ఎన్‌సీపీ (శరద్ పవార్) తొమ్మిది సీట్లలో పోటీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. అయితే, సాంగ్లీ, భీవండి, ముంబై నార్త్ వెస్ట్, ముంబై సౌత్ సెంట్రల్ లోక్‌సభ స్థానాలపై కాంగ్రెస్, శివసేన (యూబీటీ) డిమాండ్ చేస్తున్నాయి. ఇక మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలు ఐదువిడతల్లో జరుగనున్నాయి. ఏప్రిల్ 19, 26, మే 7, 13, 20 తేదీల్లో ఎన్నికలు జరుగనుండగా... జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

మోదీ ప్రత్యర్థి అజయ్‌రాయ్



- 46మందితో కాంగ్రెస్ నాలుగో జాబితా
- రాజ్‌గఢ్ నుంచి డిగ్గీరాజా
- మధ్యప్రదేశ్ నుంచి అత్యధికంగా 12మందికి చోటు
- ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన డానిశ్ అలీకి సీటు

న్యూఢిల్లీ: వారణాసిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీపై మరోమారు ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ పోటీకి దిగనున్నారు. సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ 46 మందితో కూడిన మరో జాబితాను శనివారం రాత్రి విడుదల చేసింది. ఇందులో మధ్యప్రదేశ్‌లో 12, ఉత్తర్‌ప్రదేశ్‌లో 9, తమిళనాడులో 7, రాజస్థాన్‌లో 3, ఉత్తరాఖండ్, మణిపూర్, జమ్మూకశ్మీర్‌లో రెండేసి స్థానాలకు అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. వాటితోపాటు అసోం, ఛత్తీస్‌గఢ్, బెంగాల్, అండమాన్ నికోబార్ దీవులలో ఒక స్థానానికి అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. తాజా జాబితాతో కలిపి కాంగ్రెస్ ఇప్పటివరకు 184 మంది అభ్యర్థులను ప్రకటించినట్లయింది. నరేంద్ర మోదీపై వారణాసి నియోజకవర్గం నుంచి ఉత్తర్‌ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్‌రాయ్ పోటీ చేయనున్నారు. అజయ్‌రాయ్ ఇదివరకే అయిదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. వారణాసి లోక్‌సభ స్థానం నుంచి 2009లో సమాజ్‌వాదీ పార్టీ తరఫున 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓడిపోయారు. ఆ రకంగా మోదీపై పోటీ ఇది మూడోసారి కానుంది. బీజేపీ విద్యార్థి విభాగం ఏబీవీపీలో రాజకీయ జీవితం ప్రారంభించారు రాయ్. 1996-2007 మధ్య మూడుసార్లు బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత అసెంబ్లీ ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 2012లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల బీఎస్పీ నుంచి పార్టీలోకొచ్చిన ఎంపీ డానిష్ అలీకి అమ్రోహా సీటు కేటాయించింది. బారాబంకి ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి పార్టీ సీనియర్ నాయకుడు పీఎల్ పునియా తనయుడు తనూజ్ పునియా పోటీ చేయనున్నారు. మధ్యప్రదేశ్‌లో రాజ్‌గఢ్ నుంచి సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్ రంగంలోకి దిగుతున్నారు. డిగ్గీ రాజా చివరిసారిగా 1991 సాధారణ ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి గెలిచారు. అయితే, 2019లో ఎన్నికల్లో భోపాల్ నుంచి పోటీచేసిన ఆయన... సాధ్వి ప్రజ్ఞా ఠాకూర్ చేతిలో ఓటమి చవిచూశారు. ఏకంగా ఆమె 3.5 లక్షల ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. మధ్యప్రదేశ్‌లోని 29 సీట్లలో కాంగ్రెస్ ఒక్కటి మాత్రమే గెలిచింది. దీంతో ఆయన పునరాగమనం బీజేపీ ఎత్తులకు పైఎత్తులు వేయగలదని భావిస్తున్నారు. రత్లాం నుంచి కాంతిలాల్ బూరియాను బరిలోకి దింపింది. తమిళనాడులోని శివగంగైన నుంచి సీనియర్ నేత చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం, విరుధునగర్ నుంచి ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్‌ను రంగంలోకి దింపింది. అదే స్థానం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి అయిన సినీనటి రాధికా శరత్‌కుమార్‌తో తలపడనున్నారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వికాస్ ఠాక్రే పోటీ చేయనున్నారు. యూపీలోని సహరాన్‌పూర్ నుంచి ఇమ్రాన్ మసూద్, హరిద్వార్ నుంచి ఉత్తరాఖండ్ మాజీ సీఎం హరీశ్ రావత్ తనయుడు వీరేందర్ రావత్‌లకు కాంగ్రెస్ టికెట్ కేటాయించింది. జమ్మూ కశ్మీర్‌లోని ఉదంపూర్ నుంచి కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌పై చౌదరి లాల్ సింగ్, జమ్ము నుంచి జమ్మూ కశ్మీర్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ్ భల్లా అభ్యర్థిత్వం ఖరారు చేసింది. అయితే, పార్టీకి కంచుకోటలైన అమేథీ, రాయబరేలీ అభ్యర్థుల విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. ఆ రెండు

3, 6 తరగతులకు కొత్త సిలబస్: సీబీఎస్ఈ

ఢిల్లీ: రాబోయే విద్యా సంవత్సరానికి (2024-25) సంబంధించి మూడు, ఆరు తరగతుల సిలబస్ మారనుందని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) వెల్లడించింది. ఈ రెండు తరగతులకు మినహా మిగిలిన వాటికి మారబోదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తన అనుబంధ పాఠశాలలకు సీబీఎస్ఈ తెలియజేసింది. మూడు, ఆరు తరగతుల కొత్త సిలబస్‌తోపాటు పాఠ్యపుస్తకాలను త్వరలో విడుదల చేస్తామని సీబీఎస్ఈకి విద్య, పరిశోధన, శిక్షణ జాతీయ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) సమాచారం ఇచ్చింది. పాఠశాలలన్నీ కొత్త సిలబస్‌ను అనుసరించాలని సీబీఎస్ఈ డైరెక్టర్ (అకడమిక్స్) జోసెఫ్ ఎమ్మాన్యుయేల్ సూచించారు. 'ఆరో తరగతి విద్యార్థులకు అదనంగా బ్రిడ్జి కోర్సు ఉంటుంది. మూడో తరగతికి కుదించిన విధివిధానాలను ఎన్‌సీఈఆర్‌టీ విడుదల చేయనుంది. కొత్త విద్యా విధానానికి అనుగుణంగా పాఠశాలల అధిపతులకు, ఉపాధ్యాయులకు సామర్థ్య నిర్వహణ శిక్షణ కార్యక్రమాలను చేపడతాం' అని వివరించారు.

రంగులు పూసి ముస్లిం కుటుంబానికి వేధింపులు

లక్నో: బైక్‌పై వెళ్తున్న ముస్లిం కుటుంబంపై కొందరు వ్యక్తులు రంగు నీళ్లు పోసి వేధించారు. బలవంతంగా వారి ముఖాలకు రంగులు పూశారు. 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. ధాంపూర్ నగరంలో కొందరు వ్యక్తులు ముందుగానే హోలీ వేడుక జరుపుకున్నారు. రోడ్డు మీద బైక్‌పై వెళ్తున్న ముస్లిం కుటుంబాన్ని ఈ సందర్భంగా వేధించారు. ఇద్దరు మహిళలతో సహా ఒక వ్యక్తిపై రంగు నీళ్లు పోశారు. అభ్యంతరం వ్యక్తం చేసిన వారి ముఖాలకు రంగులు పూశారు. 'హర్ హర్ మహాదేవ్', 'జై శ్రీరామ్' అంటూ మతపరమైన నినాదాలు చేశారు. కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో హోలీ పేరుతో ముస్లిం కుటుంబాన్ని వేధించడంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత పోలీసులను ఆదేశించారు.

'బీజేపీది రాజకీయం కాదు... ప్రజాస్వామ్య హత్య': సుప్రీయా సూలే

ముంబై: బీజేపీలో చేరేవాళ్లంతా ఆ పార్టీ మీద ప్రేమతో కాదని ఎన్సీపీ (శరద్ చంద్ర పవార్) పార్టీ ఎంపీ సుప్రీయా సూలే అన్నారు. ఇన్‌కంట్యాక్స్ డిపార్టుమెంట్, సీబీఐ, ఈడీ కారణంగా బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడారు. బారామతి నియోజకర్గంలో తనపై పోటీగా ఎవరు నిలబడతారనే విషయం ఇంకా తెలియదన్నారు. అధికారికంగా ప్రకటన వెలువడలేదని చెప్పారు. 'దేశంలో ప్రజాస్వామ్యం హత్యకు గురువుతోంది. బీజేపీలో ఎవరూ ప్రేమతో చేరటం లేదు. ఇన్‌కంట్యాక్స్, సీబీఐ, ఈడీ వల్ల చేరుతున్నారు. బీజేపీ అశోక్ చవాన్‌పై ఒత్తిడి తెచ్చి పార్టీలోకి చేర్చుకుంది. బీజేపీ... పార్టీలను ఎలా ముక్కలు చేస్తోందో తెలుస్తోంది. ఇది రాజకీయం కాదు... ప్రజాస్వామ్య హత్య' అని సుప్రీయా సూలే మండిపడ్డారు. గత ఎన్నికలతో పోల్చితే ఈసారి భిన్నంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎన్సీపీ రెండుగా చీలిపోయిన విషయం తెలిసిందే. ఎన్సీపీని చీల్చిన అజిత్ పవార్.. బీజేపీ, శివసేన (ఏక్‌నాథ్ షిండే) కూటమి ప్రభుత్వంలో ఉన్నారు. అయితే కీలకమైన బారామతి లోక్‌సభ స్థానంలో పవార్ వర్సెస్ పవార్‌గా పోటీ ఉండనున్నట్లు తెలుస్తోంది. ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ సతీమణి పర్యావరణ కార్యకర్త సునేత్ర పవార్ బారామతి బరిలో దిగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. బారామతిలో ఈసారి కూడా తానే విజయం సాధిస్తానని సుప్రీయా సూలే ఆశాభావం వ్యక్తం చేశారు. 'బారామతి నియోజకవర్గ ప్రజలకు నేను చేసిన పనులు అందరికీ తెలుసు. నాపై ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవు' అని సుప్రీయా సూలే స్పష్టం చేశారు. బారామతి లోక్‌సభ స్థానం నుంచి ఆమె 2009 నుంచి మూడుసార్లు ఎంపీగా గెలుపొందారు. బారామతి పార్లమెంట్ స్థానం ఎన్సీపీ (శరత్ చంద్ర పవార్) చీఫ్ శరత్ పవార్ కుటుంబానికి కంచుకోట.

జేడీయూ 16 ఎంపీ అభ్యర్థుల జాబితా విడుదల

పాట్నా : బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ రాష్ట్రంలో తాను పోటీ చేస్తున్న మొత్తం 16 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఆదివారం ప్రకటించింది. ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీలు), అత్యంత వెనుకబడిన తరగతులు (ఈబీసీలు) కు ప్రాధాన్యత ఇచ్చినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. పార్టీ నాయకులు వశిష్ఠ నారాయణ్ సింగ్, సంజయ్ కుమార్ ఝా సమక్షంలో జేడీయూ కార్యాలయంలో ప్రకటించిన జాబితా ప్రకారం 12 మంది సిట్టింగ్ ఎంపీలకు వారి స్థానాల నుంచి మరోసారి అవకాశం కల్పించారు. అయితే, సీతామర్హి, శివన్ స్థానాల్లో సిట్టింగ్ ఎంపీలు సునీల్ కుమార్ పింటు, కవితా సింగ్‌కు టికెట్లు నిరాకరించింది. పార్టీ మాజీ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ (లలన్) సింగ్‌కు ఈ జాబితాలో చోటు దక్కింది. ఈయన ముంగర్ నియోజకవర్గం నుంచి బరిలో ఉండనున్నారు. పార్టీ శాసన మండలి చైర్మన్ దేవేశ్ చంద్ర ఠాకూర్‌కు, తన భర్త రమేశ్ సింగ్ ఠాకూర్‌తో ముందు రోజే పార్టీలో చేరిన జేడీయూలో చేరిన విజయలక్ష్మీ దేవికి టికెట్ కేటాయించింది. అభ్యర్థులందరినీ పార్టీ అధ్యక్షుడైన సీఎం నితీశ్ నిర్ణయించారని, చాలా మంది సిట్టింగ్ ఎంపీలపై విశ్వాసం ఉంచామని, అయితే కొన్ని చోట్ల మార్పులు చేశామని ఝా చెప్పారు. ఈ వారం ప్రారంభంలో ఎన్‌డీఏలో ప్రకటించిన ఫార్ములా ప్రకారం, జేడీయూకి రాష్ట్రంలోని 40 సీట్లలో 16 కేటాయించారు. ఇది లోక్‌సభలో దాని ప్రస్తుత బలానికి సమానం. అయితే ఐదేళ్ల క్రితం పోటీ చేసిన సంఖ్య కంటే ఒకటి తక్కువ.

బీఎస్‌పీ 16 మంది అభ్యర్థుల ప్రకటన

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లోని 80 స్థానాల్లో 16 లోక్‌సభ స్థానాలకు గాను బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) ఆదివారం అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. కొన్ని జిల్లాల్లో పార్టీ ఇన్‌ఛార్జ్‌లు ముందుగా జిల్లా స్థాయిలో అభ్యర్థులను ప్రకటించారు. మాయావతి నేతృత్వంలోని పార్టీ సహరాన్‌పూర్ నుంచి మాజిద్ అలీ, కైరానా నుంచి శ్రీపాల్ సింగ్, ముజఫర్‌నగర్ నుంచి దారా సింగ్ ప్రజాపతి, బిజ్నోర్ నుంచి విజయేంద్ర సింగ్, నగీనా (ఎస్సీ స్థానం) నుంచి సురేంద్ర పాల్ సింగ్, మొరాదాబాద్ నుంచి మహ్మద్ ఇర్ఫాన్ సైఫీను బరిలోకి దించింది. అలాగే, రాంపూర్ నుంచి జీషాన్ ఖాన్, సంభాల్ నుంచి షౌలత్ అలీ, అమ్రోహా నుంచి మొజాహిద్ హుస్సేన్, మీరట్ నుంచి దేవవ్రత్ త్యాగి, బాగ్పట్ నుంచి ప్రవీణ్ బన్సాల్‌కు టికెట్లు ఇచ్చినట్లు తెలిపింది. గౌతమ్ బుద్ధ నగర్ నుంచి రాజేంద్ర సింగ్ సోలంకి పార్టీ అభ్యర్థిగా, బులంద్‌షహర్ (ఎస్సీ స్థానం) నుంచి గిరీష్ చంద్ర జాతవ్, అయోన్లా నుంచి అబిద్ అలీ, పిలిభిత్ నుంచి అనిస్ అహ్మద్ ఖాన్ అలియాస్ ఫూల్ బాబు, షాజహాన్‌పూర్ (ఎస్సీ) నుంచి దోదారం వర్మ బరిలోకి దిగనున్నట్లు పేర్కొంది. ఏప్రిల్ 19 నుంచి ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి.

నా ప్రచారాన్ని అడ్డుకునేందుకే సీబీఐ దాడులు

ఈసీకి టీఎంసీ నేత మొయిత్రా ఫిర్యాదు

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు, మాజీ ఎంపీ మహువా మొయిత్రా ఆదివారం ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తూ సీబీఐ తనను వేధిస్తోందని, ఎన్నికల ప్రచార ప్రయత్నాలను అడ్డుకుందని ఆరోపించారు. నగదుకు ప్రశ్నలు కేసుకు సంబంధించి సీబీఐ బృందాలు మాజీ ఎంపీ నివాసాల్లో అనేక చోట్ల శనివారం సోదాలు నిర్వహించిన ఒక రోజు తర్వాత ఆమె ఈ లేఖ రాశారు.

కృష్ణానగర్ లోక్‌సభ స్థానం నుంచి తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మొయిత్రా... తన అభ్యర్థిత్వం గురించి తెలిసినప్పటికీ సీబీఐ ఉద్దేశపూర్వకంగా వరుసగా నాలుగు దాడులు నిర్వహించిందని పేర్కొన్నారు. 'నా ప్రచార ప్రక్రియకు ఆటంకం కలిగించే ఉద్దేశంతో, పోలింగ్ రోజున నాపై ప్రతికూల అభిప్రాయాన్ని సృష్టించడం కోసమే ఇది జరిగింది' అని ఆమె లేఖలో ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థ 'చట్టవిరుద్ధంగా దాడి చేసిన' ప్రాంగణంలో తన ఎన్నికల ప్రచార కార్యాలయం, అధికారిక కార్యాలయం ఉన్నాయని తెలిపారు. 'అందువల్ల, నా ఎన్నికల ప్రచార ప్రయత్నాలను అణచివేయడానికి, తద్వారా నన్ను చట్టవిరుద్ధంగా వేధించేందుకే తమ చర్యలు లక్ష్యంగా చేసుకున్నాయని సీబీఐకి నిస్సం దేహంగా తెలుసు అనడంలో సందేహం లేదు' అని ఆమె వాదించారు. 'సీబీఐ చేసిన ఇటువంటి దుష్ప్రచారం నా రాజకీయ ప్రత్యర్థులను

పూర్తిగా, అన్యాయంగా సుసంపన్నం చేసింది' అని తృణమూల్ నాయకురాలు ఆరోపించారు. సీబీఐ ఈ సమయంలో చేసిన దాడి, దాని పద్ధతి చూస్తే వారు రాజకీయ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారనే అనుమానం కలిగిస్తుందన్నారు. 'మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉన్న కాలంలో కేంద్ర దర్యాప్తు సంస్థల దర్యాప్తుకు సంబంధించి మార్గదర్శకాలు/ ముసాయిదాలను అత్యవసరంగా జారీ చేయాల్సిన అవసరం ఉంది' అని మొయిత్రా నొక్కి చెప్పారు. కృష్ణానగర్ లోక్‌సభ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీగా ఉన్న మొయిత్రా, నగదుకు ప్రశ్నలు ఆరోపణలపై పార్లమెంటరీ కమిటీ విచారణ తర్వాత 'అనైతిక ప్రవర్తన' కారణంగా డిసెంబరులో లోక్‌సభ నుంచి బహిష్కరణకు గురయ్యారు. అయితే అదే స్థానం నుంచి టీఎంసీ ఆమెను మళ్లీ పోటీకి దింపింది.

25 మందితో బీఎస్పీ జాబితా

తొలుత 16 మంది ఆపై మరో తొమ్మిది మంది పేర్ల ప్రకటన

గువహతి: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆదివారం 25 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఒక్కరోజులోనే రెండు జాబి తాలు వెలువరించింది. సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ నుంచి పోటీ చేయబోయే 16 మంది పేర్లతో మొదటి జాబితా విడుదల చేసింది. అందులో ముస్లింలకు పెద్ద పీట వేసింది. కొన్ని గంటల వ్యవధిలోనే తొమ్మిది మందితో మరో జాబితా విడుదల చేసింది. తొలి జాబితాలో మహమ్మద్ ఇర్ఫాన్ సైఫీ (మొరాదాబాద్), ముజాహిద్ హుస్సేన్ (అమ్రోహా), మజీద్ అలీ (సహరన్‌పూర్), జీషన్ ఖాన్ (రాంపూర్), అనీస్ అహ్మద్ ఖాన్ అలియాస్ ఫూల్ బాబు (పలిభిత్), షౌకత్ అలీ (శంభల్), ఆబిద్ అలీ (ఓన్లా), సురేంద్ర సింగ్ పాల్ (నగీనా), గిరీశ్ చంద్ర జాతవ్ (బులంద్‌షెహర్), దోద్రమ్ వర్మ (షాజహాన్‌పూర్), విజేంద్ర సింగ్ (బిజ్నోర్), ప్రవీణ్ బన్సల్ (బాగ్‌పట్), దేవరత్ త్యాగి (మీరట్), దారా సింగ్ ప్రజాపతి (ముజఫర్‌నగర్), శ్రీపాల్ సింగ్ (కైరానా), రాజేంద్ర సింగ్ సోలంకి (గౌతం బుద్ధ నగర్) పేర్లను ప్రకటించింది. ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు హాజి ఫజ్లూర్ రెహమాన్ (సహరన్‌పూర్), మలూక్ నగర్ (బిజ్నోర్)కు టికెట్ ఇచ్చేందుకు నిరాకరించింది. రెండవ జాబితాలో హత్రాస్ నుంచి హేమా బాబు ధంగర్, కమల్ కాంత్ ఉపమాన్యు (మథుర), పూజా అమ్రోహి (ఆగ్రా), రామ్ నివాస్ శర్మ (ఫత్తేపూర్ సిక్రీ), సత్యేంద్ర జైన్ సౌలి (ఫిరోజాబాద్), సారికా సింగ్ బాఘెల్ (ఇటావా), కుల్దీప్ బదౌరియా (కాన్పూర్), రాజేశ్ కుమార్ ద్వివేది (అక్బర్‌పూర్), సురేంద్ర చంద్ర గౌతం (జాలౌన్) పేర్లను బీఎస్పీ ప్రకటించింది.

111 మంది అభ్యర్థులతో బీజేపీ ఐదో జాబితా

ఏపీలో ఆరుగురు... తెలంగాణలో ఇద్దరు

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న క్రమంలోబీజేపీ ఆదివారం లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఐదో జాబితా విడుదల చేసింది. హర్యానాలోని కురుక్షేత్ర నుంచి నవీన్ జిందాల్, హిమాచల్‌లోని మండి నుంచి నటి కంగనా రనౌత్, సంభల్‌పూర్ నుంచి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బీజేపీ పోటీకి దింపింది. ఇక కర్నాటకలోని బెల్గాం నుంచి జగదీశ్ షెట్టర్‌తో సహా కొందరు నేతల పేర్లతో భారతీయ జనతా పార్టీ లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల ఐదవ జాబితాను ప్రకటించింది. మొత్తం 111 మందితో కూడిన జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి నుంచి బాలీవుడ్ నటి కంగనా రనౌత్ పోటీ చేయనున్నారు. మీరట్ నుంచి రామాయణం నటుడు అరుణ్ గోవిల్‌కు పార్టీ టికెట్ ఇచ్చింది. జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ తమ్లుక్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగనున్నారు. సుల్తాన్‌పూర్ నుంచి బీజేపీ ఎంపీ మేనకా గాంధీకి టికెట్ ఇచ్చారు. జనరల్ వీకే సింగ్‌ను ఘజియాబాద్ నుంచి తప్పించారు. ఆయన స్థానంలో ఎయిర్‌ఫోర్స్ మాజీ చీఫ్ ఆర్‌కేఎస్ భదౌరియా బరిలోకి దిగుతున్నారు. బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర పూరీ నుంచి పోటీ చేయనున్నారు. ఇక వరుణ్‌గాంధీని పక్కనబెట్టిన బీజేపీ ఆయన స్థానంలో జితిన్‌ప్రసాద్‌ను రంగంలోకి దింపింది. కురుక్షేత్ర నుంచి పారిశ్రామికవేత్త, కాంగ్రెస్ మాజీ ఎంపీ నవీన్ జిందాల్ బరిలోకి దిగారు. పాట్నా సాహిబ్ అభ్యర్థిగా రవిశంకర్ ప్రసాద్ ఎంపికయ్యారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ బెగుసరాయ్ నుంచి ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. ముజఫర్‌పూర్ నుంచి రాజ్‌భూషణ్ నిషాద్, పట్లీపుత్ర నుంచి రామ్ కృపాల్ యాదవ్‌లకు బీజేపీ టిక్కెట్ ఇచ్చింది. బక్సర్ నుంచి కేంద్ర సహాయ మంత్రి అశ్విని చౌబే టికెట్‌ను నిరాకరించింది. బక్సర్ నుంచి మిథిలేష్ తివారీ అభ్యర్థిగా ఎంపికయ్యారు. ససారం నుంచి ఛెడ్డీ పాశ్వాన్‌కు కూడా టికెట్ ఇవ్వలేదు. అతని స్థానంలో శివేష్ రామ్ అభ్యర్థిగా ఖరారు అయ్యారు. ముజఫర్‌పూర్ నుంచి అజయ్ నిషాద్‌కు టికెట్ దక్కలేదు.

రాజమండ్రి నుంచి పురందేశ్వరి

ఐదో జాబితాలో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఎనిమిది అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. ఏపీలో టీడీపీ, జనసేనతో పొత్తులో భాగంగా బీజేపీకి 6 లోక్‌సభ, 10 అసెంబ్లీ స్థానాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పార్టీ తరఫున పోటీ చేసే ఎంపీ అభ్యర్థులను అధిష్ఠానం ప్రకటించింది. రాజమండ్రి లోక్‌సభ స్థానం నుంచి ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి పేరు ఖరారు అయ్యింది. అనకాపల్లి నుంచి సీఎం రమేశ్, అరకు స్థానం నుంచి కొత్తపల్లి గీత, రాజంపేట నుంచి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి, తిరుపతి (ఎస్సీ) నుంచి వరప్రసాదరావు, నరసాపురం లోక్‌సభ స్థానంలో శ్రీనివాస్ వర్మకు టికెట్లు కేటాయించారు. ఇక తెలంగాణలోని ఖమ్మం ఎంపీ స్థానాన్ని తాండ్ర వినోద్ రావు, వరంగల్ సీటును ఆరూరి రమేశ్ కు బీజేపీ కేటాయించింది. ఇక తెలంగాణలోని రెండు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. వరంగల్ (ఎస్సీ) స్థానానికి ఆరూరి రమేశ్, ఖమ్మం నుంచి తాండ్ర వినోద్‌రావును అభ్యర్థులుగా ప్రకటించారు.

మోదీ ప్రత్యర్థి అజయ్‌రాయ్

- 46 మందితో కాంగ్రెస్ నాలుగో జాబితా
- రాజ్‌గఢ్ నుంచి డిగ్గీరాజా
- మధ్యప్రదేశ్ నుంచి అత్యధికంగా 12 మందికి చోటు
- ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన డానిశ్ అలీకి సీటు

న్యూఢిల్లీ: వారణాసిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీపై మరోమారు ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ పోటీకి దిగనున్నారు. సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ 46 మందితో కూడిన మరో జాబితాను శనివారం రాత్రి విడుదల చేసింది.

ఇందులో మధ్యప్రదేశ్‌లో 12, ఉత్తర్‌ప్రదేశ్‌లో 9, తమిళనాడులో 7, రాజస్థాన్‌లో 3, ఉత్తరాఖండ్, మణిపూర్, జమ్మూకశ్మీర్‌లో రెండేసి స్థానాలకు అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. వాటితోపాటు అసోం, చత్తీస్‌గఢ్, బెంగాల్, అండమాన్ నికోబార్ దీవులలో ఒక స్థానానికి అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. తాజా జాబితాతో కలిపి కాంగ్రెస్ ఇప్పటివరకు 184 మంది అభ్యర్థులను ప్రకటించినట్లయింది. నరేంద్ర మోదీపై వారణాసి నియోజకవర్గం నుంచి ఉత్తర్‌ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్‌రాయ్ పోటీ చేయనున్నారు. అజయ్‌రాయ్ ఇదివరకే అయిదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. వారణాసి లోక్‌సభ స్థానం నుంచి 2009లో సమాజ్‌వాదీ పార్టీ తరఫున 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓడిపోయారు. ఆ రకంగా మోదీపై పోటీ ఇది మూడోసారి కానుంది. బీజేపీ విద్యార్థి విభాగం ఏబీవీపీలో రాజకీయ జీవితం ప్రారంభించారు రాయ్. 1996-2007 మధ్య మూడుసార్లు బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత అసెంబ్లీ ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 2012లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల బీఎస్పీ నుంచి పార్టీలోకొచ్చిన ఎంపీ డానిష్ అలీకి అమ్రోహా సీటు కేటాయించింది. బారాబంకి నుంచి ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి

పార్టీ సీనియర్ నాయకుడు పీఎల్ పునియా తనయుడు తనూజ్ పునియా పోటీ చేయనున్నారు. మధ్యప్రదేశ్‌లో రాజ్‌గఢ్ నుంచి సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్ రంగంలోకి దిగుతున్నారు. డిగ్గీ రాజా చివరిసారిగా 1991 సాధారణ ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి గెలిచారు. అయితే, 2019లో ఎన్నికల్లో భోపాల్ నుంచి పోటీచేసిన ఆయన... సాధ్వి ప్రజ్ఞా ఠాకూర్ చేతిలో ఓటమి చవిచూశారు. ఏకంగా ఆమె 3.5 లక్షల ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. మధ్యప్రదేశ్‌లోని 29 సీట్లలో కాంగ్రెస్ ఒక్కటి మాత్రమే గెలిచింది. దీంతో ఆయన పునరాగమనం బీజేపీ ఎత్తులకు పైఎత్తులు వేయగలదని భావిస్తున్నారు. రత్లాం నుంచి కాంతిలాల్ బూరియాను బరిలోకి దింపింది. తమిళనాడులోని శివగంగైన నుంచి సీనియర్ నేత చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం, విరుధునగర్ నుంచి ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్‌ను రంగంలోకి దింపింది. అదే స్థానం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి అయిన సినీనటి రాధికా శరత్‌కుమార్‌తో తలపడనున్నారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వికాస్ ఠాక్రే పోటీ చేయనున్నారు. యూపీలోని సహరాన్‌పూర్ నుంచి ఇమ్రాన్ మసూద్, హరిద్వార్ నుంచి ఉత్తరాఖండ్ మాజీ సీఎం హరీశ్ రావత్ తనయుడు వీరేందర్ రావత్‌లకు కాంగ్రెస్ టికెట్ కేటాయించింది. జమ్మూ కశ్మీర్‌లోని ఉదంపూర్ నుంచి కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌పై చౌదరి లాల్ సింగ్, జమ్ము నుంచి జమ్మూ కశ్మీర్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ్ భల్లా అభ్యర్థిత్వం ఖరారు చేసింది. అయితే, పార్టీకి కంచుకోటలైన అమేథీ, రాయబరేలీ అభ్యర్థుల విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. ఆ రెండు స్థానాలకు ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. గత ఎన్నికల్లో రాహుల్ గాంధీకి అమేథీలో ఓటర్లు షాకిచ్చారు. ఆయనపై కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ విజయం సాధించారు. ఈసారి కూడా అక్కడ బీజేపీ ఆమెకే సీటు ఇచ్చింది. రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్‌తో పాటు అమేథి నుంచి పోటీ చేస్తారనే ప్రచారం సాగుతోంది. ఇక, సోనియా గాంధీ ప్రత్యక్ష ఎన్నికల నుంచి తప్పుకోవడంతో ఆమె పోటీచేస్తోన్న రాయబరేలిలో ఎవరికి టిక్కెట్ ఇస్తారనే ఉత్కంఠ నెలకొంది. ప్రియాంక గాంధీ పోటీచేస్తారనే ఊహాగానాలు ఉన్నాయి. ఇక, యూపీలోని మొత్తం 80 లోక్‌సభ స్థానాలకుగాను సమాజ్‌వాదీ పార్టీతో పొత్తులో భాగంగా కాంగ్రెస్ 17 చోట్ల పోటీ చేస్తోంది.

'అరబిందో ఫార్మా' బాండ్లలో 66శాతం బీజేపీకే...

రూ.52కోట్ల విలువ చేసే బాండ్లలో మిగిలిన వాటా బీఆర్ఎస్, టీడీపీకి

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కేసులో అప్రూవర్‌గా మారిన శరత్ చంద్రారెడ్డికి చెందిన అరబిందో ఫార్మా కంపెనీ కొనుగోలు చేసిన బాండ్లలో అధిక వాటా బీజేపీకి వెళ్లినట్లు ఎన్నికల సంఘం తాజాగా విడుదల చేసిన డేటా ద్వారా తెలుస్తోంది. 2021 ఏప్రిల్ నుంచి 2023 నవంబరు వరకు బాండ్ల డేటాను ఈసీ విడుదల చేసింది. మొత్తం రూ.52కోట్లు విలువ చేసే బాండ్లను అరబిందో ఫార్మా కొనుగోలు చేయగా ఇందులో నుంచి 66శాతం బీజేపీకి, 29శాతం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కు, మిగతాది తెలుగుదేశంపార్టీ (టీడీపీ)కి వెళ్లినట్లు వెల్లడైంది. ఈ రూ.52 కోట్లు విలువ చేసే బాండ్లలో 57శాతం 2022 నవంబరు 2023 నవంబరు మధ్య సేకరించినట్లు పేర్కొంది. 2022 నవంబరు10న శరత్ చంద్రారెడ్డి అరెస్టు కాగా ఆ తర్వాత ఐదు రోజులకు అంటే 15వ తేదీన రూ.5కోట్లు విలువ చేసే బాండ్లను ఫార్మా కంపెనీ మొదటిసారి కొనుగోలు చేసిందని, 21వ తేదీన వాటిని బీజేపీ రిడీమ్ చేసుకున్నట్లు డేటా చెబుతోంది. అరబిందో ఫార్మా నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న శరత్ చంద్రా రెడ్డిని ఢిల్లీ మద్యం కేసులో అప్రూవర్‌గా మారేందుకు 2023 జూన్‌లో ఢిల్లీ కోర్టు అనుమతిచ్చింది. ఆ కేసులో ఆయనకు బెయిల్ కూడా ఇచ్చింది. ఇదే అంశాన్ని కేజ్రీవాల్ అరెస్టు క్రమంలో ఢిల్లీ విద్యాశాఖ మంత్రి అతిశి శనివారం ప్రస్తావించారు. కాగా, దేశంలో అగ్ర ఫార్మా కంపెనీల్లో అరబిందో ఫార్మా ఒకటిగా ఉంది. 2023లో ఈ కంపెనీ ఆదాయం రూ.24వేల కోట్లు దాటింది. 150 దేశాల్లో ఈ కంపెనీ సేవలు అందిస్తోంది. విదేశాల నుంచే 90శాతం ఆదాయాన్ని ఈ కంపెనీ పొందుతుంది.

'ఇండోసోల్'కు భూముల కేటాయింపుపై సీబీఐ విచారణ

రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఇండోసోల్ కంపెనీకి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 17,630 ఎకరాల భూమిని కేటాయించడంపై సీబీఐతో విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడానికి ఒకరోజు ముందుగానే ముఖ్యమంత్రి జగన్ తన బినామీ కంపెనీ అయిన ఇండోసోల్‌కు 17,630 ఎకరాల భూమిని హడావుడిగా కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఇది జగన్ బరితెగింపునకు నిదర్శనమన్నారు. ఇంత నియంతలా వ్యవహరిస్తున్న రాజకీయ నేత, ముఖ్యమంత్రి చరిత్రలో జగన్‌మోహన్ రెడ్డి తప్ప మరొకరు లేరని, ఆయన అధికారం చేపట్టాక ఇండోసోల్ కంపెనీకి రామయాపట్నం పోర్టు దగ్గర, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలలో దాదాపు 25 వేల ఎకరాల భూములను అప్పనంగా కట్టబెట్టారని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం జగన్‌కు అండగా ఉండబట్టే ఇంత బరితెగించి భూ కేటాయింపులకు సిద్ధపడుతున్నారని పేర్కొన్నారు. అలాగే, కడప జిల్లా ఒంటిమిట్టలో వైసీపీ నేతల భూకబ్జాలు, వేధింపుల కారణంగా ఒకే కుటుంబంలోని ముగ్గురు ఆత్మహత్య చేసుకోవటంపై విచారకరం వ్యక్తం చేశారు. వైసీపీ మూకల ఆగడాలను, ఎన్నికల కోడ్ కాలంలో కోట్ల రూపాయిల విలువ కలిగిన భూములను జగన్‌మోహన్ రెడ్డి బినామీ కంపెనీకి దారాదత్తం చేయడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. జగన్ గతంలో కేసులు ఎదుర్కొన్న మాదిరిగానే రానున్న కాలంలో కూడా భూముల దారాదత్తం కూడా కేసులు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. సీఎం జగన్ నియంతృత్వ చర్యలను ప్రజాతంత్ర వాదులంతా ఖండించాలని కోరారు. ఎన్నికల కమిషన్ తక్షణమే జోక్యం చేసుకొని భూముల కేటాయింపును రద్దు చేయాలని, దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎన్డీఆర్ఎఫ్ నిధుల విడుదలపై 'సుప్రీం'కు కర్నాటక

బెంగళూరు: కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నీటి కొరతతో అల్లాడుతున్న రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడంలేదని పేర్కొన్నారు. కేంద్రం నుంచి నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 'రాష్ట్రానికి కరువు సహాయ నిధుల పంపిణీలో జాప్యంపై కేంద్ర ప్రభుత్వంపై ఈ పిటిషన్ దాఖలు చేశాం' అని సిద్ధరామయ్య తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై మంత్రివర్గ బృందం నివేదిక సమర్పించి ఐదు నెలలు గడుస్తున్నా కేంద్రం నిధులు విడుదల చేయలేదని ఆరోపించారు. రాష్ట్రం తీవ్ర కరువుతో అల్లాడుతోందని, దీంతో జనజీవనం అతలాకుతలమవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 236 తాలూకాల్లో 223 తాలూకాలు కరువుగా ప్రకటించారని, వీరిలో 196 ప్రాంతాలు తీవ్ర కరువు ప్రాంతంగా ప్రకటించినట్లు వివరించారు. గత 30-40 ఏళ్లలో అత్యంత తీవ్రమైన పరిస్థితి ఉందని, 48 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు చెప్పారు. నిధులు విడుదల చేయాలని కేంద్రానికి మూడుసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా రాలేదన్నారు. పిటిషన్‌లో ఖరీఫ్ 2023 సీజన్‌లో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు కలిపి రూ.35,162 కోట్ల మేర నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ కింద కేంద్రం నుంచి రూ.18,171.44 కోట్లు సహాయం చేయాలని కోరినట్లు తెలిపారు. నివేదిక వచ్చినా కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పిటిషన్లో పేర్కొన్నారు. విపత్తు నిర్వహణ చట్టం 2005 ప్రకారం కేంద్రం నుంచి సహాయం పొందే అర్హత రాష్ట్రానికి ఉందని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ నివేదిక అందిన నెలలోగా ఎన్డీఆర్ఎఫ్ నుంచి రాష్ట్రానికి సహాయం అందించే విషయంలో కేంద్రం తుది నిర్ణయం తీసుకోవాలని పిటిషన్ పేర్కొంది. గతేడాది అక్టోబరులో కేంద్ర ప్రభుత్వ బృందం రాష్ట్రానికి వచ్చి పరిశీలించిందని సిద్ధరామయ్య తెలిపారు. కరువుపై కేంద్రానికి మంత్రులతో కలిసి ఢిల్లీకి వెళ్లామని, కానీ కేంద్రమంత్రులు ఎవరూ కలువలేదన్నారు. ఆ తర్వాత మళ్లీ కేంద్ర హోంశాఖ మంత్రిని కలిసినా ఇంకా నిధులు విడుదల చేయలేదని పేర్కొన్నారు.

సీఎం పేరుతో ఆప్ మంత్రి జారీచేసిన లేఖ నకిలీది: బీజేపీ

న్యూఢిల్లీ: జైలు నుంచి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ రాజధానిలో నీటిసరఫరాకు చేపట్టడానికి సంబంధించి ఆదేశాలు జారీ చేశారన్న వార్తలను బీజేపీ జాతీయ కార్యదర్శి మంజీందర్ సింగ్ సిర్సా కొట్టిపారేశారు. 'ఆప్ మంత్రి అతిశి విలేకరుల సమావేశం ద్వారా సీఎం కేజ్రీవాల్ జారీ చేసిన లేఖ నకిలీది. ఆమె ఢిల్లీ ప్రజలను మోసం చేసింది. అరవింద్ కేజ్రీవాల్ ఈడీ కస్టడీలో ఉన్నారు. అది సీఎం కార్యాలయం... మద్యం షాపు కాదని మంత్రి అతిశికి, ఆ పార్టీకి చెప్పాలనుకుంటున్నాను. ఈడీ కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం కోర్టు అనుమతి ఇచ్చే వరకు ఎటువంటి ఉత్తర్వును జారీ చేయలేడు' అని సిర్సా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ లేని సమయంలో సీఎం కార్యాలయాన్ని ఎవరు ఉపయోగించారు? అధికారిక లేఖను ఎవరు రూపొందించారు.. జారీ చేశారు? ఈ విషయాలు నేరపూరిత కుట్రలో భాగమని, దీనిపై విచారణ జరిపించాలని ఢిల్లీ ఎల్జీ వినయ్ కుమార్ సక్సేనాను కోరుతున్నాను' అన్నారు.

తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత విజయవాడ వచ్చిన కె.శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఏఐకేఎస్ అధ్యక్షులు రావుల వెంకయ్య తదితరులు

శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న జర్నలిస్టు యూనియన్ నాయకులు సోమసుందర్, సుబ్బారావు, ఎస్.కె.బాబు, చందు జనార్దన్, ఆలపాటి సురేష్, చావా రవి తదితరులు



శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు ఓబులేసు, రవీంద్రనాథ్, కొండలరావు

శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, విశాలాంధ్ర సిబ్బంది

నూతన వస్త్రాలతో శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించిన విశాలాంధ్ర ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.